ఉష్ణోగ్రత శుక్రవారం గరిష్ఠం : 29.0 కనిష్ఠం : 19.0
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
అనంతపురం
జిల్లా వార్తలు
శనివారం 6 డిసెంబరు 2025





విద్యార్థులు తయారు చేసిన నమూనాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత



విద్యార్థులతో ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు



బెలూన్లు ఎగురవేస్తున్న ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు



విద్యార్థినుల సందడి



ముద్ద తిను తల్లీ..



అనంతపురంలో పీటీఎం కోలాహలం

# సంబరంగా మెగా పీటీఎం

● తరలివచ్చిన తల్లిదండ్రులు ● పాల్గొన్న కలెక్టర్, ఎమ్మెల్యేలు, నాయకులు



ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, వెంకటశివుడు యాదవ్



కొర్రపాడు గురుకుల బాలికల పాఠశాలలో ఓపెన్ ఆడిటోరియాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

అనంతపురం విద్య, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో శుక్రవారం మెగా పీటీఎం(పేరెంట్స్ టీచర్స్ మీట్) సంబరాలు ఘనంగా జరిగాయి. ప్రభుత్వ ఆదేశాల మేరకు దాదాపు 1752 ప్రభుత్వ పాఠశాలల్లో ఈవేడుకలు సాగాయి. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు భారీగా రావడంతో ఆయా పాఠశాలల్లో సందడి నెలకొంది. కలెక్టరు ఆనంద్ ఆత్మకూరు జడ్పీ హైస్కూల్‌లో జరిగిన కార్యక్రమానికి హాజరయ్యారు. ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు బొమ్మనహాళ్ మండలం ఉద్దేహాళ్ జడ్పీ హైస్కూల్‌లో జరిగిన పీటీఎంలో పాల్గొని సహపంక్తి భోజనం చేశారు. రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత సిండికేట్‌నగర్‌లోని జడ్పీ హైస్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్నారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడుయాదవ్ గుత్తి బాలికల ఉన్నతపాఠశాలలో జరిగిన వేడుకల్లో పాల్గొన్నారు. కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు కళ్యాణదుర్గం మోడల్ స్కూల్, కుందుర్పి జూనియర్ కళాశాలల్లో జరిగిన వేడుకలలో పాల్గొన్నారు. డీఈఓ ప్రసాద్‌బాబు నార్పల బాలికల ఉన్నతపాఠశాలలో జరిగిన వేడుకల్లో పాల్గొని, విద్యార్థుల ప్రగతి ఇతరత్ర కార్యక్రమాలను పరిశీలించారు. రాష్ట్ర మాంసాభివృద్ధి చైర్మన్ ప్రకాష్‌నాయుడు నగరంలోని శారదా నగరపాలక బాలికల ఉన్నత పాఠశాల, ఆర్టీసీ రీజినల్ చైర్మన్ పూల నాగరాజు కేఎస్ఆర్ బాలికల ఉన్నత పాఠశాల, వీరశైవలింగాయత్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ స్వప్న రజకనగర్, ఆర్‌కేనగర్ పాఠశాలల్లో నిర్వహించిన వేడుకల్లో పాల్గొన్నారు. ఆయా కార్యక్రమాల్లో పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు మాట్లాడుతూ ప్రతిఒక్కరికీ నాణ్యమైన ఉచిత విద్యను అందించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయన్నారు. ప్రభుత్వ సౌకర్యాలను వినియోగించుకుని విద్యార్థులు బాగా చదువుకోవాలని సూచించారు.



క్రీడా పరికరాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి



డ్యాన్స్ చేస్తున్న విద్యార్థిని, బిడ్డకు తినిపిస్తున్న తల్లి

## డీజిల్ దందా

- పురానికి అక్రమంగా కర్ణాటక డీజిల్
- రోజూ 10వేల లీటర్లుపైగానే..
- అక్రమార్కులకు కలిసి వస్తున్న ధర వ్యత్యాసం
- చోద్యంచూస్తున్న అధికారులు



రాత్రిపూట డీజిల్ తరలిస్తున్న వాహనం

హిందూపురం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): డీజిల్ దందా యథేచ్ఛగా సాగుతోంది. కర్ణాటక నుంచి నిత్యం డీజిల్‌ను హిందూపురానికి అక్రమంగా తెస్తున్నారు. హిందూపురానికి చెందిన వ్యక్తులు కర్ణాటకలో పెట్రోల్ బంక్ నిర్వహిస్తున్నారు. మన రాష్ట్రంలో కంటే కర్ణాటకలో ధరలు తక్కువగా ఉండటంతో నిత్యం 10వేల లీటర్లకుపైగా డీజిల్ తీసుకొచ్చి, విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఇలా నిత్యం వేలాది లీటర్ల డీజిల్‌ను అక్రమంగా విక్రయించడంవల్ల స్థానిక పెట్రోల్‌బంక్ యజమానులు ఇబ్బంది పడుతున్నారు. అధికార యంత్రాంగం పట్టించుకోకపోవడంతో

(మిగతా 6వ పేజీలో...)

## నేడు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రాక

అనంతపురం కలెక్టరేట్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ శనివారం జిల్లాలో పర్యటించనున్నారని కలెక్టర్ ఆనంద్ ప్రకటనలో తెలిపారు. ఉదయం 7.50 గంటలకు విజయవాడ నుంచి బయలుదేరి 9.35 గంటలకు బెంగుళూరు ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారన్నారు. అక్కడి నుంచి రోడ్డుమార్గంలో 11.45 గంటలకు అనంతపురం కలెక్టరేట్‌కు వస్తారన్నారు. పీఎం కుసుమ్, పీఎం సూర్యఘర్, అన్ని ఎన్‌ఆర్‌ఈడీసీఏపీ ప్రాజెక్టులపై ఆయా శాఖల జిల్లా అధికారులతో సీఎస్ సమీక్ష నిర్వహిస్తారన్నారు. రాత్రికి అనంతపురంలోనే బసచేసి, ఆదివారం ఉదయం 10 గంటలకు రోడ్డుమార్గాన హైదరాబాద్‌కు బయలుదేరి వెళతారని కలెక్టర్ తెలిపారు.

# అంతా అస్తవ్యస్తం!

- తాడిపత్రిలో కేంద్రాన్ని ప్రారంభించని వైనం
- కొత్త యాప్‌తో రైతుల ఇబ్బందులు
- సమస్యలు పరిష్కరించే నాథుడు కరువు
- అయోమయంలో రైతులు

## మద్దతు ధరతో పత్తి కొనుగోలుపై నిర్లక్ష్యం



తాడిపత్రి మార్కెట్ యార్డులో తెరుచుకోని కొనుగోలు కేంద్రం

అనంతపురంఅర్బన్/తాడిపత్రి/గుత్తి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రారంభించిన పత్తి కొనుగోలు కేంద్రాలలో కొనుగోలు ప్రక్రియ అస్తవ్యస్తంగా మారింది. ఈ ఏడాది కొత్తగా కపాస్ కిసాన్ యాప్‌ను తీసుకురావడమే గందరగోళానికి కారణమవుతోంది. గతంలో ఈ-క్రాప్ బుక్ చేసుకున్న రైతులతో సీఎం యాప్ ద్వారా పేర్లు నమోదు చేసుకుని కొనుగోలు కేంద్రాల్లో పత్తి కొనేవారు. అయితే ఈ ఏడాది రైతులు పత్తి విక్రయించేందుకు కపాస్ కిసాన్ యాప్‌లో తమ పేర్లను నమోదు చేసుకోవాలని షరతు పెట్టారు. నిర్దేశించిన తేదీల్లోనే యాప్ ద్వారా రైతులు స్లాట్ బుక్ చేసుకోవాలన్న నిబంధన విధించారు. రైతు సేవా కేంద్రాల్లో సిబ్బంది ఈ ప్రక్రియ చేయాల్సి ఉండగా, కొత్త యాప్ సక్రమంగా పనిచేయడం లేదని, రైతులు సెల్ ఫోన్లల్లో యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని పేర్లు నమోదు చేసుకోవాలని ఉచిత సలహా ఇస్తున్నారు. దీంతో

(మిగతా 6లో..)

### వారానికి ఒకరోజే కొనుగోలు

గుత్తి మార్కెట్ యార్డులో వారానికి ఒక రోజు మాత్రమే పత్తి కొనుగోలు చేయాలని సీసీఐ(కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) అధికారులు నిర్ణయించారు. దీంతో రైతులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. గతనెల 28న స్లాట్ బుకింగ్‌కు అవకాశం ఇచ్చారు. ఈ సమయంలో పెద్దవడుగూరుకు చెందిన 16 మంది యాప్‌లో స్లాట్ బుక్ చేసుకున్నారు. వీరిని ఈనెల 3న కొనుగోలు కేంద్రానికి రావాలని యాప్ ద్వారానే సమాచారం అందించారు. వీరిలో 14 మంది రైతులు పత్తిని గుత్తి మార్కెట్ యార్డులోని కొనుగోలు కేంద్రానికి తీసుకువెళ్లారు. ఇందులో ఏడుగురు రైతులతో 255 క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేశారు. మిగిలిన రైతులకు చెందిన 250 క్వింటాళ్ల పత్తి నాణ్యతగా లేదని తిరస్కరించారు. బాధిత రైతులు నిరసన వ్యక్తం చేసినా ఎలాంటి ప్రయోజనం లేకపోయింది. తిరిగి ఈనెల 4న యాప్‌లో స్లాట్ బుక్ చేసుకునేందుకు అవకాశం ఇచ్చారు. ఇప్పటి దాకా 18 మంది రైతులు స్లాట్ బుక్ చేసుకున్నారు. వీరికి ఈనెల 10న కొనుగోలు కేంద్రానికి పత్తిని తీసుకురావాలని యాప్ ద్వారా సమాచారం ఇచ్చారు. యాప్‌పై అవగాహన ఉన్న రైతులకు మాత్రమే ఈ సమాచారం తెలిసే అవకాశం ఉంది. మిగతా రైతులకు ఏఏ తేదీల్లో స్లాట్ బుక్ చేసుకోవాలి..? ఏఏ తేదీల్లో కేంద్రానికి పత్తిని తీసుకువెళ్లాలన్న సమాచారం తెలియని దుస్థితి నెలకొంది.



గుత్తి మార్కెట్ యార్డుకు పత్తిని తీసుకొచ్చిన వాహనాలు (ఫైల్)

## గులాబీ గుబులు



- పత్తి పంటలో ఉధృతంగా గులాబీ రంగు పురుగు
- మందులు పిచికారీ చేసినా ప్రయోజనం శూన్యం
- ఆందోళనలో రైతులు

6

## హైవేల జంక్షన్..!

- కోడూరు కేంద్రంగా జాతీయ రహదారులు ప్రారంభం
- వేగంగా గ్రీన్‌ఫీల్డ్, 342 జాతీయ రహదారుల పనులు
- అభివృద్ధి కేంద్రంగా మారనున్న కోడూరు



కోడూరు నుంచి పుట్టపర్తికి వెళ్లే 342వ జాతీయ రహదారి

చిలమత్తూరు, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పథంలో భాగంగా మండలంలోని కోడూరు గ్రామ రూపురేఖలు మారుతున్నాయి. ఎప్పటినుంచో కోడూరు తోపు పచ్చదనానికి, ఆహ్లాదకర వాతావరణానికి కేరాఫ్‌గా ఉంటోంది. అలాంటి ప్రాంతం ప్రస్తుతం రాష్ట్రంలోనే పెద్ద జాతీయ రహదారులకు పుట్టినిల్లుగా మారుతోంది. దీంతో కోడూరు రూపురేఖలు మారనున్నాయి. కోడూరు 44వ జాతీయ రహదారి పక్కనే ఉండటంతో ఇప్పుడు ఈ ప్రాంతం మరో రెండు జాతీయ రహదారులకు ప్రారంభ నిలయంగా మారుతోంది. ఇక్కడి నుంచే రాష్ట్రంలోనే రెండో అతిపెద్దదైన గ్రీన్‌ఫీల్డ్ హైవే పురుడుపోసుకుంటోంది. అదేబాటలో మరో జాతీయ రహదారి 342 కూడా ఇక్కడి నుంచే ప్రారంభమవుతోంది. దీంతో ఈ ప్రాంతం ఎంతో అభివృద్ధి చెందే అవకాశం ఉంది. 544-ఇ జాతీయ రహదారి కూడా కొడికొండ చెక్‌పోస్టు నుంచి ప్రారంభం కావడంతో ఈ ప్రాంతం జాతీయ రహదారులకు పుట్టినిల్లుగా మారిందనే చెప్పవచ్చు.

### 44వ జాతీయ రహదారి

కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు దేశంలోనే అతి (మిగతా 6లో..)

## స్క్రబ్ టైఫస్‌పై అప్రమత్తంగా ఉండాలి

● డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఈబీ దేవి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఈబీ దేవి

అనంతపురం వైద్యం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని కొన్ని జిల్లాలో స్క్రబ్ టైఫస్ కేసులు నమోదవుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఈబీ దేవి సూచించారు. డీఎంహెచ్‌ఓ కాన్ఫరెన్స్ హాల్లో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. పిడుదులు, చిడుములలోని రికెట్సియా అనే బ్యాక్టీరియా(సూక్ష్మజీవి) నుంచి స్క్రబ్ టైఫస్ సోకుతుందన్నారు. పిడుదులు, చిడుములకు ఆవాసాలైన ఎలుకలు, పందికొక్కులు, గడ్డిమైదానాల్లో రికెట్సియా బ్యాక్టీరియా ఎక్కువగా ఉంటుందన్నారు. తీవ్రమైన తలనొప్పి, జ్వరం, ఒళ్లునొప్పులు, పంటినొప్పులు, దద్దుర్లు, కళ్లకలక వంటి లక్షణాలు స్క్రబ్ టైఫస్‌కు సంకేతాలని వివరించారు. ఒంటినిండా దుస్తులు ధరించి నివాస ప్రాంతాల్లో గడ్డి, అపరిశుభ్రత లేకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. అనుమానం వచ్చిన వెంటనే సమీపంలో ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లాలని కోరారు.

### ప్రతి బిడ్డా ఆరోగ్యంగా ఉండాలి

పుట్టిన ప్రతి బిడ్డ ఆరోగ్యంగా ఉండేలా తగిన చర్యలు తీసుకోవాలని ప్రాథమిక వైద్యకేంద్రాల సూపర్‌వైజర్లు, సిబ్బందికి డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఈబీ దేవి ఆదేశించారు. పుట్టకతోవచ్చే వ్యాధులు-వాటి నివారణ అనే అంశంపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన ప్రసవాలు జరిగితే శిశువులు ఆరోగ్యకరంగా ఉంటారన్నారు. లోపాలతో జన్మించినా, అనారోగ్యానికి గురైనా సకాలంతో గుర్తించి తగిన వైద్యచికిత్సలు అందించాలన్నారు. కార్యక్రమంలో చిన్నపిల్లల వైద్యనిపుణులు డాక్టర్ ఉదయ్ భాస్కర్, డాక్టర్ శంకర్ నారాయణ, డాక్టర్ భాస్కర్ నాయక్, డీఐఓ డాక్టర్ శశిభూషణ్‌రెడ్డి, డాక్టర్ విష్ణుమూర్తి, డాక్టర్ రాధిక, పల్లవి, రాధా, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

## ప్రణాళిక రూపొందించండి

● కలెక్టర్ ఆనంద్



అనంతపురం కలెక్టరేట్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి ధన ధాన్య కృషి యోజన అమలుకు ఆయాశాఖల అధికారులు కలిసికట్టుగా ప్రణాళిక రూపొందించాలని కలెక్టర్ ఆనంద్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం పథకం అమలుపై సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ... పథకం పరిధిలో 11 శాఖలకు సంబంధించి 36 పథకాలు అమలవుతున్నాయన్నారు. వ్యవసాయ, ఉద్యాన, అనుబంధ శాఖల అధికారులు సమన్వయంతో వాటిని అమలు చేయాలన్నారు. సమీక్షలో జిల్లా వ్యవసాయ శాఖాధికారి ఉమామహేశ్వరమ్మ, హార్టికల్చర్ డీడీ ఉమాదేవి, డీసీఓ అరుణకుమారి, ఏపీఎంఐపీపీడీ రఘునాథరెడ్డి, పశుసంవర్థక శాఖ జేడీ ప్రేమ్‌చంద్, కేవీకే శాస్త్రవేత్త మల్లీశ్వరి, డ్వామా పీడీ సలీంబాషా, ఎల్డీఎం నరేష్‌రెడ్డి, డీఆర్‌డీఏ పీడీ శైలజ, పరిశ్రమల శాఖ ఏడీ రాజశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.



## ● భక్తిపారవశ్యం

భక్తరహళ్ళి బ్రహ్మోత్సవాల్లో ప్రధాన ఘట్టమైన భూతప్పల ఉత్సవం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. కోరికలు నెరవేరాలనీ, దీర్ఘకాలిక వ్యాధులు నయమవాలని పెద్ద సంఖ్యలో భక్తులు.. భూతప్పలు వచ్చే దారిలో పడుకున్నారు. వారి పైనుంచి భూతప్పలు నాట్యం చేసుకుంటూ వెళ్లారు.

6

భక్తులపై నాట్యం చేస్తూ వస్తున్న భూతప్పలు

## కంబదూరం

● పని చేయడానికి జంకుతున్న సెక్రటరీలు ● పంచాయతీల్లో అక్రమాల నేపథ్యంలోనే వెనుకంజ ● కంబదూరు మండలం నుంచి డెప్యుటేషన్‌పై వెళ్లే యత్నం (7లో...)



# భక్తి పారవశ్యం

● వైభవంగా భూతప్పల ఉత్సవం ● వేలాదిగా తరలివచ్చిన భక్తులు



జ్యోతులతో నరసింహస్వామి ఆలయ ప్రదక్షిణ చేస్తున్న భక్తులు, నరసింహస్వామి, ఆంజనేయస్వామి ఉత్సవ విగ్రహాలను తీసుకొస్తున్న అర్చకులు

మడకశిర రూరల్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రసిద్ధ భక్తరహళ్ళి నరసింహ స్వామి, జిల్లేడగుంట ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం భూతప్పల ఉత్సవం, జ్యోతుల పరుష వైభవంగా నిర్వహించారు. స్వామివార్లను ప్రత్యేకంగా అలంకరించి, పూజలు చేశారు. జిల్లేడగుంట ఆంజనేయస్వామి ఆలయం నుంచి ఉత్సవ విగ్రహాలతో ఊరేగింపుగా నరసింహస్వామి ఆలయానికి చేరుకున్నారు. అక్కడ స్వామికి పూజలు చేశారు. అనంతరం భూతప్ప ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. స్వామివారి ఉత్సవ విగ్రహాలతో అర్చకులు ముందుగా వెళ్తున్నారు. వెనకాలే నాట్యం చేసుకుంటూ భూతప్పలు కదిలారు. భూతప్పల పాదస్పర్శతో కోరికలు తీరుతాయనీ, రోగాలు నయమవుతాయని భక్తుల విశ్వాసం. దీంతో వందలాది మంది భక్తులు భక్తితో భూతప్పలు వచ్చే దారిలో పడుకున్నారు. వారిపై నాట్యం చేసుకుంటూ భూతప్పలు వెళ్లారు. గంటపాటు సాగిన ఈ ఉత్సవాన్ని వీక్షించేందుకు వేలాదిగా తరలివచ్చారు. అనంతరం నరసింహ స్వామిని దర్శించుకున్నారు.

### జ్యోతుల పరుష

తెల్లవారుజామునే జ్యోతుల పరుష ప్రారంభమైంది. మొక్కుబడి ఉన్న వారు జ్యోతులను తయారుచేసి, వాటిని తలపై పెట్టుకుని, స్వామి నామస్మరణ చేసుకుంటూ కాలినడకన జిల్లేడగుంటకు చేరుకున్నారు. ఆంజనేయస్వామి ఆలయ ప్రదక్షిణ అనంతరం భక్తరహళ్ళికి వచ్చారు. నరసింహస్వామి ఆలయ ప్రదక్షిణ చేసి, మొక్కులు తీర్చుకున్నారు. రైతులు పండించిన వేరుశనగ, వరి, అరటిపండ్లను స్వామివారి ఆలయంపై వేశారు. ఉత్సవాలకు భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు సీఐ సుబ్రహ్మణ్యం తెలిపారు. ఇద్దరు డీఎస్పీలు, నలుగురు సీఐలు, 200 మంది సిబ్బందిని నియమించినట్లు తెలిపారు.

## మంచి పత్తినే తీసుకురండి

● మార్కెటింగ్ శాఖ ఏడీ రాఘవేంద్రకుమార్



రాఘవేంద్రకుమార్, ఏడీ, మార్కెటింగ్ శాఖ

అనంతపురంరూరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పత్తిని అమ్ముకోవడానికి కొనుగోలు కేంద్రానికి వెళ్లే రైతులు పలు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని మార్కెటింగ్ శాఖ ఏడీ రాఘవేంద్రకుమార్ సూచించారు. ఆమేరకు శుక్రవారం ఆయన పత్తి రైతులకు పలు సూచనలు ఇచ్చారు. జిల్లాలోని రైతులు పండించిన పత్తిని గుత్తిలో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. రైతులు పత్తిని బాగా ఆరబెట్టి శుభ్రంగా తీసుకురావాలన్నారు. వర్షం వలన తడిసిన పత్తిని తీసుకురావద్దన్నారు. దుమ్ము, ధూళి లేకుండా చూడాలన్నారు. చెత్త, చెదారం కలిసిన పత్తిని కొనుగోలు కేంద్రానికి తీసుకురావద్దని సూచించారు. రంగు మారిన, పురుగు పట్టిన కాయలను వేరు చేసి మంచి పత్తినే తీసుకురావాలన్నారు. నీళ్లు చల్లిన, పాత పత్తిని సీసీఐ కొనుగోలు చేయదన్నారు. కౌడు పత్తి, ముడుచుకుపోయిన పత్తిని మంచి పత్తిలో కలుపవద్దన్నారు. యార్డుకు లూజ్ రూపంలో మాత్రమే తీసుకు రావాలన్నారు. అమ్మకానికి వచ్చే రైతులు బ్యాంకు పాసు పుస్తకం, ఆధార్‌కార్డు, పట్టాదారు పాసుపుస్తకం జిరాక్స్ పత్రాలను తీసుకురావాలని సూచించారు. తేమ 12శాతం మించి ఉంటే పత్తిని సీసీఐ వారు కొనుగోలు చేయరన్నారు.

# అంతా అస్తవ్యస్తం..!

(5వ పేజీ తరువాయి)

చేసేదేమిలేక రైతులు యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని పేరు నమోదు చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. అయితే సర్వర్ పనిచేయకపోవడంతో అవస్థలు పడుతున్నారు. కొత్త యాప్‌పై రైతులకు అవగాహన కల్పించడంలో సంబంధిత అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. దీంతో రైతు సేవా కేంద్రాల వద్దకు, గుత్తి మార్కెట్ యార్డుకు రైతులు ప్రదక్షిణలు చేస్తున్నారు.

### బహిరంగ మార్కెట్‌లో ధర తక్కువే

ఈ ఏడాది ఖరీఫ్‌లో పత్తి సాధారణ సాగు విస్తీర్ణం 44వేల హెక్టార్లుగా నిర్ణయించారు. అయితే జిల్లా వ్యాప్తంగా 30వేల హెక్టార్లల్లో మాత్రమే పత్తి పంట సాగైంది. గత మూడేళ్లతో పోలిస్తే ఈ సారి పత్తి పంట సాగు తగ్గింది. పెట్టుబడులు పెరగడం, మార్కెట్‌లో ఆశించిన స్థాయిలో ధర లేకపోవడమే సాగు తగ్గడానికి కారణమని రైతులు చెబుతున్నారు. ఈ సారి పంట సాగు విస్తీర్ణం తగ్గడంతోపాటు, పత్తి దిగుబడి అరకొరగానే వచ్చింది. అయినా ధర మాత్రం పెరగలేదు. కొందరు దళారులు కుమ్మక్కై ధరలు పెరగకుండా చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మూడేళ్ల కిందట క్వింటా పత్తి రూ.10వేలు పలికింది. రెండేళ్ల కిందట క్వింటా నాణ్యతను బట్టి పత్తి రూ.7వేల నుంచి రూ.8వేలు దాకా ఉండింది. ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో పత్తినాణ్యతను బట్టి క్వింటాల్ ధర రూ.5500 నుంచి రూ.7000లు దాకా పలుకుతోంది.

### మద్దత ధరతో కొనుగోలులో నిర్లక్ష్యం

ప్రభుత్వం పత్తి కనీస మద్దతు ధర రూ.8110లుగా నిర్ణయించింది. తేమ శాతం ఆధారంగా ధర చెల్లించేలా నిర్ణయించారు. 8 శాతం తేమ ఉంటే.. క్వింటాల్ పత్తి రూ.8110లుగా నిర్ణయించారు. 9 నుంచి 11 శాతం వరకు తేమ శాతం ఉంటే.. రూ.8028లు నుంచి రూ.7785లు దాకా ధర ఇవ్వాలని నిర్ణయించారు. ప్రతి ఏడాది గుత్తి, తాడిపత్రి మార్కెట్ యార్డుల్లో సీసీఐ అధికారులు పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. ఈ సారి కూడా గత నెల 22న స్థానిక ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం చేతుల మీదుగా గుత్తి మార్కెట్ యార్డులో పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఆర్భాటంగా ప్రారంభించారు. అయితే రైతుల నుంచి పత్తిని కొనుగోలు చేయలేదు. ఈ నేపథ్యంలో రైతుసంఘాల నాయకులు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో ఈనెల 3న కొనుగోలు కేంద్రాన్ని తెరిచారు. తాడిపత్రి మార్కెట్ యార్డులో ఇప్పటి దాకా కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయలేదు.

### పేరు నమోదు చేశా: రైతు నాగేంద్ర, ఊటకల్లు, గుత్తి మండలం



ఈ సారి ఆరు ఎకరాల్లో పత్తి పంట సాగు చేశా. 35 క్వింటాళ్లు దిగుబడి వచ్చింది. బయట మార్కెట్‌లో ఫస్ట్ క్వాలిటీ పత్తి క్వింటాల్ రూ.7000లు, రెండో క్వాలిటీ రకం రూ.6400లకు అడుగుతున్నారు. ఇంకా బాగలేకపోతే పత్తివైపే చూడటం లేదు. ప్రభుత్వం కనీస మద్దతు ధర రూ.8110లు పెట్టింది. వారం రోజుల క్రితమే స్థానిక రైతు సేవా కేంద్రంలో పేరు నమోదు చేసుకున్నా. ఏ రోజు పత్తి తీసుకురావాలన్న సమాచారం ఎవరూ ఇవ్వలేదు. గతంలో పేర్లు నమోదు చేసుకున్న రైతులకు ఏఏ తేదీల్లో కొనుగోలు కేంద్రానికి పత్తి తీసుకురావాలో ముందుగా చెప్పేవారు. ఇప్పుడు సమాచారం ఇచ్చే నాథుడే లేడు.

### ఇబ్బందిగా ఉంది: ఈశ్వర్‌రెడ్డి, తిమ్మాపురం, పెద్దవడుగూరు



పత్తి విక్రయించాలనుకొనే రైతులు కొత్త యాప్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని షరతు పెట్టడంతో ఇబ్బందిగా ఉంది. సెల్ ఫోన్‌లో యాప్ డౌన్‌లోడ్ చేసుకొని, అందులో స్లాట్ బుక్ చేసుకోవాలని చెబుతున్నారు. అది ఎలా చేయాలన్నది మాకు తెలియదు. రైతు సేవా కేంద్రానికి వెళ్లిన సమయంలో సర్వర్ సరిగా పనిచేయడం లేదు. గత ఏడాది మా గ్రామంలోని చాలా మంది రైతులు గుత్తి మార్కెట్ యార్డులో పత్తి శాంపుల్స్ ఇచ్చినా.. పత్తిని కొనుగోలు చేయలేదు. ఈ సారైనా పత్తి కొనుగోలు చేస్తారో...? లేదో అర్థం కావడం లేదు. బయట మార్కెట్‌లో ధర తక్కువగా ఉంది. ప్రభుత్వం రైతులకు ఇబ్బందులు లేకుండా ముందస్తుగా సమాచారం అందించి, పత్తి కొనుగోలు చేయాలి. .

### వారానికి ఒకరోజు.. దారుణం



ఎన్నడూలేని విధంగా వారానికి ఒక రోజు మాత్రమే పత్తిని కొనుగోలు చేసేలా అధికారులు నిర్ణయించడం దారుణం. రైతులకు అవగాహన కల్పించకనే కొత్త యాప్‌లు తీసుకురావడం సరికాదు. స్లాట్ బుకింగ్‌తోపాటు ఏ తేదీన పత్తిని కేంద్రానికి తీసుకువెళ్లాలన్న సమాచారం కూడా యాప్‌లో చూసుకుంటేనే తెలుస్తోంది. మార్కెట్ యార్డు అధికారులకు కూడా ఈ సమాచారం ముందస్తుగా తెలియకపోవడం ఏమిటో అర్థం కావడం లేదు. సీసీఐ అధికారులు, మార్కెట్ యార్డు యంత్రాంగం మధ్య పూర్తి స్థాయిలో సమన్వయం లేదు. నాణ్యత లేదంటూ రైతులు తీసుకువెళ్లిన పత్తిని కొనుగోలు చేయకుండా వెనక్కి పంపిస్తున్నారు. ఈ అంశాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలి. గ్రామాల్లో టాంటాం ద్వారా రైతులకు స్లాట్ బుకింగ్ తేదీతోపాటు ఏఏ తేదీల్లో కేంద్రానికి పత్తిని తీసుకువెళ్లాలో సమాచారం ఇవ్వాలి. తాడిపత్రిలోనూ తక్షణమే కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించాలి. లేనిపక్షంలో రైతుల పక్షాన ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తాం.

- చంద్రశేఖర్‌రెడ్డి,
ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి

# హైవేల జంక్షన్..!

(5వ పేజీ తరువాయి)

పొడవైనది 44వ జాతీయ రహదారి. ఈ రహదారి కోడూరు మీదుగా వెళ్లడంతో మొదటి నుంచి రవాణా సౌకర్యం ఎంతో మెరుగ్గా ఉంటోంది. దేశంలో ఏ ప్రాంతానికి వెళ్లాలన్నా సునాయాసంగా వెళ్లేందుకు వీలుంది. రాష్ట్రానికి సరిహద్దుగా కోడూరు ప్రాంతం ఉండటంతో ఈ రహదారి ఈ ప్రాంత వాసులకు వరంగా మారిందనే చెప్పవచ్చు.



పెద్దన్నపల్లి వద్ద నిర్మాణంలో ఉన్నగ్రీన్‌ఫీల్డ్ హైవే

### గ్రీన్ ఫీల్డ్ హైవే

గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. 44వ జాతీయ రహదారిలోని కోడూరు వద్ద ఈ ఆరు వరుసల ఎక్స్‌ప్రెస్ జాతీయ రహదారి ప్రారంభమై బాపట్ల జిల్లాలోని అద్దంకి వద్ద ఎన్‌హెచ్ 16లో కలుస్తుంది. ఎక్స్‌ప్రెస్ జాతీయ రహదారి నిర్మాణం ఈ ప్రాంత అభివృద్ధికి నాంది అని చెప్పవచ్చు. రూ.14 వేల కోట్లతో 518 కిలోమీటర్ల పొడవుతో ఈ రహదారి నిర్మాణం జరుగుతోంది. సాధారణంగా బెంగళూరు నుంచి విజయవాడకు ప్రయాణ సమయం 10 నుంచి 12 గంటలు పట్టేది. ఈ రహదారి నిర్మాణం పూర్తయితే 5 నుంచి 6 గంటల్లోపే చేరుకోవచ్చు. దీంతో బెంగళూరు నుంచి విజయవాడకు వెళ్లేవారు ఈ రహదారి గుండానే ప్రయాణం చేస్తారు.

### 342వ జాతీయ రహదారి

44వ జాతీయ రహదారిలోని కోడూరు వద్ద 342 జాతీయ రహదారి ప్రారంభమై ముదిగుబ్బ వద్ద ఎన్‌హెచ్ 42లో కలుస్తుంది. ఈ రహదారి బెంగళూరు నుంచి పుట్టపర్తికి రాకపోకలు సాగించేందుకు అనువుగా ఉంటుంది. కోడూరు నుంచి ముదిగుబ్బ వరకు 47 కిలోమీటర్లు పొడవు ఉంది. పుట్టపర్తి ఆధ్యాత్మిక కేంద్రం కావడంతో దేశవిదేశీయులు బెంగళూరు నుంచి వెళ్లేందుకు ఈ జాతీయ రహదారి ఎంతో సౌలభ్యంగా ఉంటుంది. ఇప్పటికే ఈ జాతీయ రహదారి నాలుగు వరుసలుగా రూపుదిద్దుకుంటోంది. త్వరలో పనులు పూర్తి చేసుకుని, ప్రజలకు అందుబాటులోకి రానుంది.

### 544ఇ రహదారి

44వ జాతీయ రహదారిలోని కొడికొండ చెక్‌పోస్టు నుంచి నాలుగు వరుసల 544ఇ జాతీయ రహదారి ప్రారంభమై కర్నాటకలోని శిర వద్ద ఎన్‌హెచ్ 48లో కలుస్తుంది. ఈ రహదారి 119 కిలోమీటర్ల పొడవు ఉంది. దీంతో ఉత్తర కర్నాటకకు ప్రయాణించే వారికి ఎంతో సౌలభ్యంగా ఉంటుంది.

### అభివృద్ధికి చిహ్నం

దేశ అభివృద్ధిలో జాతీయ రహదారుల పాత్ర గొప్పదనే విషయం అందరికీ తెలిసిందే. నాలుగు జాతీయ రహదారులు ఒకే చోట నుంచి ప్రారంభమైతే ఇక వేరే చెప్పాల్సిన పనిలేదు. కోడూరు కేంద్రంగా నాలుగు జాతీయ రహదారులు ప్రారంభమై పలు ప్రాంతాలకు వెళ్తున్నాయి. ఈ నేపథ్యంలో కోడూరు ప్రాంతం భవిష్యత్తు అభివృద్ధికి చిహ్నంగా నిలుస్తుందనడంలో సందేహం లేదు. కోడూరు మీదుగా ఈ జాతీయ రహదారులు వెళ్లనుండడంతో రాష్ట్రస్థాయిలో కోడూరు పేరు అందరికీ పరిచయంగా మారనుంది. త్వరలో ఈ ప్రాంతం పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న తరుణంలో కోడూరు ఐకాన్‌గా మారుతుందనడంలో సందేహం లేదు. ఇప్పటికే భూముల ధరలు పెరగడంతో పాటు రియల్ ఎస్టేట్ వ్యాపారం పుంజుకునే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. దాంతో ఈ ప్రాంతం ఆర్థికాభివృద్ధిలో అడుగులు వేస్తుందనడంలో అతిశయోక్తి లేదు.

# డీజిల్ దందా

(5వ పేజీ తరువాయి)

అక్రమార్కుల యాపారం నిరాఘాటంగా సాగుతోంది.

### రోజుకు 10వేల లీటర్లు

హిందూపురం, గోరంట్ల, పెనుకొండ రహదారిలో ఉన్న పరిశ్రమలకు కర్నాటక నుంచి తెచ్చిన డీజిల్‌ను రోజూ 4వేల నుంచి 5వేల లీటర్లు ఇస్తున్నట్లు సమాచారం. గార్మెంట్స్, కియ అనుబంధ పరిశ్రమల ఏర్పాటు చేసిన ప్రైవేట్ బస్సులకు మరో 2వేల లీటర్లదాకా రోజూ ఇస్తున్నట్లు తెలిసింది. అయితే పరిశ్రమలకు రాత్రి పొద్దుపోయాక తీసుకొచ్చి విక్రయిస్తున్నారు. బస్సులకైతే పగటిపూటే అవి పార్క్‌చేసిన స్థలానికి వాహనాల్లో వెళ్లి నింపుతున్నట్లు సమాచారం.

### రూ.లక్షలు పోగేసుకుంటున్న అక్రమార్కులు

ఆంధ్రలో లీటరు డీజిల్ రూ.100 ఉండగా కర్నాటకలో రూ.92 నుంచి రూ.93కే దొరుకుతోంది. అంటే లీటరుపై రూ.7దాకా వ్యత్యాసం ఉంది. లీటరుపై రూపాయి ఖర్చులు పోయినా రూ.6 మిగులుతుంది. ఈలెక్కన డీజిల్ తరలించే వ్యక్తులు నెలకు దాదాపు రూ.20లక్షలకుపైగా వెనకేసుకుంటున్నారు. ఇదంతా ప్రభుత్వాదాయానికి గండి కొట్టి సంపాదిస్తున్నదే. నెలకు 3లక్షల లీటర్లు పైగానే కర్నాటక నుంచి హిందూపురం ప్రాంతానికి డీజిల్‌ను అక్రమంగా తరలిస్తున్నారు. ఇందుకోసం మూడు టాటాఏస్ వాహనాలకు ప్రత్యేక ఏర్పాటు చేసుకున్నారు.

### చోద్యంచూస్తున్న అధికారులు

కర్నాటక నుంచి డీజల్‌ను తీసుకొచ్చి దర్జాగా ఇక్కడ విక్రయిస్తున్నా సంబంధిత అధికారులు అటువైపు కన్నెత్తి చూడటం లేదు. కొన్ని సందర్భాల్లో లారీ ట్యాంకర్‌నే ఇక్కడున్న పెట్రోల్‌బంకు వద్దకు తెచ్చి అమ్మేస్తున్నారు. దీన్ని పన్నులు, పౌరసఫరాల శాఖ అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. ఈ డీజిల్ దందాలో కొందరు చిన్న స్థాయి నాయకులు ఉండటం వల్లే అధికారులు అటువైపు కన్నెత్తి చూడటం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

### నిఘా ఉంచాం: కృష్ణవేణి, సీటీఓ, హిందూపురం



కర్నాటక నుంచి ఆంధ్రకు అక్రమంగా డీజిల్ సరఫరా చేస్తున్నట్లు మా దృష్టికి వచ్చింది. దీనిపై నిఘా పెట్టాం. త్వరలోనే అక్కడి నుంచి డీజిల్ తీసుకొచ్చే వ్యక్తులు, వాహనాలను పట్టుకుంటాం. ప్రభుత్వ ఆదాయానికి నష్టం కలిగిస్తే ఉపేక్షించేది లేదు.

## 47 మందికి ఉద్యోగాలు

అనంతపురం ప్రెస్‌క్లబ్, డిసెంబరు5(ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన ప్రాంగణ నియామకాల్లో 47 మంది విద్యార్థులు ఉద్యోగాలు సాధించారు. కళాశాల ప్రాంగణంలో డిల్ఫీ టీవీఎస్ టెక్నాలజీస్ కంపెనీ శుక్రవారం నియామకాలు చేపట్టింది. కళాశాల మెకానికల్, ఈఈఈ, ఈసీఈ బ్రాంచుల విద్యార్థులు పాల్గొనగా... 47 మందిని ఎంపిక చేశారు. ఉద్యోగాలను ఎంపికైన విద్యార్థులను ఇండస్ట్రియల్, ప్లేస్‌మెంట్స్ డైరెక్టర్ ఆచార్య కిరణ్మయి, ప్రిన్సిపాల్ ఆచార్య చెన్నారెడ్డి, ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణ నియామకాల అధికారి డా. శ్రీనివాసులు అభినందించారు.

## జేడీఏ చంద్రానాయక్‌కు తీవ్ర మందలింపు

అనంతపురం అర్బన్, డిసెంబరు5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పనిచేస్తున్న సమయంలో ఏడీఏ పీపీ విద్యావతిపై అమర్యాదగా, దురుసుగా ప్రవర్తించారన్న అభియోగాలపై అప్పటి జేడీఏ చంద్రానాయక్‌ను వ్యవసాయ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ రాజశేఖర్ తీవ్రంగా మందలిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన ప్రస్తుతం కడప జిల్లా వ్యవసాయ అధికారిగా పనిచేస్తున్నారు. గతంలో జేడీఏ కార్యాలయంలో పనిచేసిన ఏడీఏ పీపీ విద్యావతి జేడీఏ తనను ఇతర ఉద్యోగుల ఎదుట అమర్యాదగా, దురుసుగా ప్రవర్తించి, అవమానించారని ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో కమిషనరేట్ ఉన్నతాధికారితో విచారణ చేయించారు. విచారణలో ఫిర్యాదులో పేర్కొన్న అంశాలు వాస్తవమేనని నివేదికలు ఇచ్చినట్లు సమాచారం. భవిష్యత్తులో ఇలాంటి పొరపాట్లు చేయనని చంద్రానాయక్ ఉన్నతాధికారులకు లిఖిత పూర్వకంగా విన్నవించారు. ఈ నేపథ్యంలో చంద్రానాయక్‌ను తీవ్రంగా మందలించడంతో పాటు భవిష్యత్తులో తమ పరిధిలో పనిచేసే ఉద్యోగులపై దురుసుగా, అమర్యాదగా ప్రవర్తించకూడదని హెచ్చరించారు.

## వీఆర్వో వెంకోబారావు సస్పెన్షన్



వీఆర్వో వెంకోబారావు

నార్పల, డిసెంబరు5 (ఆంధ్రజ్యోతి): రైతును లంచం డిమాండ్ చేసిన మండలంలోని దుగుమర్రి వీఆర్వో వెంకోబారావును కలెక్టర్ ఆనంద్ సస్పెండ్ చేశారు. మూడు రోజులక్రితం రంగాపురం గ్రామానికి చెందిన రైతు నాగార్జున, కుళ్లాయప్ప భూమిని మ్యుటేషన్ చేయడానికి సెల్‌ఫోన్‌లో వీఆర్వో వెంకోబారావు రూ.38 వేలు లంచం డిమాండ్ చేశాడు. వీఆర్వో మాట్లాడిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో కలెక్టర్ విచారణకు ఆదేశించారు. ఆ నివేదిక ఆధారంగా వీఆర్వోను సస్పెండ్ చేశారు.

## రేపు స్కాలర్‌షిప్ టెస్టు

● విద్యార్థులకు ఉచిత రవాణా సౌకర్యం

పుట్టపర్తిరూరల్, డిసెంబరు5(ఆంధ్రజ్యోతి): సంస్కృతి స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్ కళాశాలలో ఈనెల 7న ఉచిత స్కాలర్‌షిప్ టెస్టు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ హేమచంద్ర శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా జర్మనీ అనహిత స్టిఫుంగ్ ఫౌండేషన్ సహకారంతో బీటెక్, బీబీఏ అడ్మిషన్ల కోసం నిర్వహించే స్కాలర్‌షిప్ టెస్టులో అర్హత సాధించిన విద్యార్థులకు హాస్టల్ సౌకర్యంతోపాటు ఉచిత విద్య అందిస్తామన్నారు. బీటెక్ అడ్మిషన్ల కోసం ప్రస్తుతం ఎంపీసీ స్ట్రీమ్‌ను అభ్యసిస్తున్న ఇంటర్మీడియట్ రెండో సంవత్సరం విద్యార్థినీవిద్యార్థులు, బీబీఏ ప్రవేశానికి ఇంటర్మీడియట్ అన్ని స్ట్రీమ్స్ వారు అర్హులన్నారు. వివరాలకు 9100974530 నంబరులో సంప్రదించాలన్నారు. విద్యార్థులు పరీక్షకు హాజరయ్యేందుకు అనంతపురం, హిందూపురం, ధర్మవరం, మడకశిర, కదిరి పట్టణాల నుంచి ఉచిత రవాణాసదుపాయం కల్పించనున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.



స్కాలర్‌షిప్ టెస్టు పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కళాశాల సిబ్బంది

## భూసార పరీక్షలు తప్పనిసరి

● భూసార పరీక్షాకేంద్రం ఏడీఏ రోజా పుష్పలత

అనంతపురం అర్బన్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): రైతులు తమ పొలాలకు సంబంధించి భూసార పరీక్షలు తప్పని సరిగా చేయించుకోవాలని అనంతపురం భూసార పరీక్షాకేంద్రం ఏడీఏ రోజా పుష్పలత సూచించారు. స్థానిక ప్రకృతి వ్యవసాయ విభాగ కార్యాలయంలో శుక్రవారం రైతులతో సమావేశం నిర్వహించారు. ఏడీఏ మాట్లాడుతూ... భూసార పరీక్షల ఆధారంగా పొలాల్లో తగిన మేరకు ఎరువులు వాడాలన్నారు. తద్వారా ఎరువులకు అనవసరంగా పెట్టే ఖర్చులు తగ్గడంతోపాటు, పంటలు మంచి దిగుబడులు వస్తాయన్నాయన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం డీపీఎం లక్ష్మానాయక్, భూసార పరీక్షాకేంద్రం ఏఓ కృష్ణకుమారి పాల్గొన్నారు.

# గులాబీ గుబులు

● పత్తి పంటలో ఉధృతంగా గులాబీ రంగు పురుగు
● మందులు పిచికారీ చేసినా ప్రయోజనం శూన్యం
● ఆందోళనలో రైతులు



ఏపుగా పెరిగిన పత్తిపంట

పెద్దవడుగూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పత్తిపంటను గులాబీరంగు పురుగు గుల్ల చేస్తోందని రైతులు గగ్గోలు పెడుతున్నారు. మండలంలో 15వేల హెక్టార్లలో పత్తి పంట సాగు చేశారు. పంట విత్తనం మొదలుకొని దిగుబడి చేతికి వచ్చే వరకు ఎకరాకు రూ.25వేల నుంచి 30వేల వరకు పెట్టుబడి పెట్టాల్సి వస్తోందని రైతులు చెబుతున్నారు. గతంలో ఎకరా సాగుచేస్తే 15నుంచి 20క్వింటాళ్ల మేర దిగుబడి వచ్చేదని, గిట్టుబాటు ధర ఉండటంతో మంచి ఆదాయం లభించేదని రైతులు చెబుతున్నారు. పత్తి సాగుతో మంచి ఆదాయం ఉండటంతో గత కొన్నేళ్లుగా రైతులు ఈ పంటను ఎక్కువగా సాగు చేస్తున్నారు. గులాబీరకం పురుగు పత్తి రైతుల ఆశలకు గండి కొడుతోంది. పిందె దశలో ఉన్న పత్తి కాయలకు గులాబీరంగు పురుగు ఆశించడం వల్ల కాయ మాడిపోతుంది. పంటను కాపాడుకోవడానికి వేల రూపాయలు వెచ్చించి రసాయన మందులు పిచికారీ చేసినా ప్రయోజనం లేకుండా పోతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మొక్కలు ఏపుగా పెరిగి పత్తి కాయలు బాగా వచ్చినా గులాబీ రంగు పురుగు ఆశించడంతో కాయ పగలకుండా మాడిపోతోంది. అరకొరగా వచ్చే దిగుబడి సైతం నాణ్యతగా లేకపోవడంతో తక్కువ ధరకు అమ్మాల్సి వస్తోందని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.



పత్తికాయలను ఆశించిన పురుగు



గులాబీ రంగు పురుగు

### మే, జూన్ మాత్రమే అనుకూలం



రైతులు పత్తి పంట సాగు చేయడానికి మే, జూన్ నెలలు మాత్రమే అనుకూలం. అదునుదాటిన తర్వాత పత్తి సాగు చేస్తే శీతల ప్రభావం వల్ల పూతదశలో గులాబీరంగు పురుగు ఆశిస్తుంది. ఎన్నిమార్లు రసాయనిక పురుగుమందులు పిచికారీ చేసినా, లింగాకర్షక బుట్టలు ఏర్పాటుచేసినా నివారించడం కష్టం. రైతులు ఒకేపంటను ఏళ్లతరబడి సాగుచేయకుండా ఇతర పంటలను సాగు చేయాలి. అప్పుడు ఖర్చు తగ్గి, ఆదాయం పెరిగే అవకాశం ఉంటుంది. -మునికృష్ణ, వ్యవసాయాధికారి

### నష్టం వాటిల్లింది: నల్లపురెడ్డి, కండ్లగూడూరు గ్రామం



నేను మూడు ఎకరాల విస్తీర్ణంలో వర్షాధారంగా పత్తి సాగు చేశా. ఎకరాకు రూ.25వేల చొప్పున మూడెకరాలకు 75వేలు పెట్టుబడి పెట్టా. ఇప్పటికి కేవలం మూడు క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. పంటకు ఆశించిన గులాబీరంగు పురుగు నివారణకు ఎన్ని చర్యలు చేపట్టినా ప్రయోజనం లేదు. దీంతో దిగుబడిపై తీవ్ర ప్రభావం పడుతోంది. తద్వారా రైతులకు నష్టం మిగులుతోంది.

### అప్పులు మిగిల్చింది: రంగనాయకులు, పెద్దవడుగూరు



కౌలుకు తీసుకొని ఆరు ఎకరాల్లో పత్తి పంట సాగుచేశా. ఎకరాకు రూ.50వేలు చొప్పున పెట్టుబడి పెట్టగా ఒక్క కేజీ కూడా దిగుబడి రాలేదు. ఈ ఏడాది కాకపోయినా మరో ఏడాది అయినా వ్యవసాయం లాభసాటిగా ఉంటుందన్న ఆశతో పంట సాగుచేస్తుంటే, ప్రతి ఏటా అప్పులే మిగులుతున్నాయి. ఏమాత్రం ఆర్థిక ప్రయోజనం ఉండటం లేదు.

## అప్పుల ఉరికి నేతన్న బలి


కృష్ణమూర్తి (ఫైల్)

ధర్మవరం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రాంనగర్‌కు చెందిన నీలూరి కృష్ణమూర్తి(60) అప్పుల బాధతో శుక్రవారం ఆత్మహత్య చేసుకున్నాడు. టూటౌన్ సీఐ రెడ్డప్ప తెలిపిన మేరకు.... కృష్ణమూర్తి సొంత మగ్గంపై పట్టు చీరలు నేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఈయనకు భార్య నాగలక్ష్మి, ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. కుమార్తెలకు వివాహాలు అయ్యాయి. కుమారుడు బెంగళూరులో ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. కుమార్తెల వివాహాల కోసం కృష్ణమూర్తి దాదాపు రూ.10లక్షల దాకా అప్పులు చేశాడు. కాగా గత 8నెలల నుంచి కృష్ణమూర్తి నడుము నొప్పితో బాధపడుతుండేవాడు. దీంతో మగ్గం నేయడం చేతకాక, కుటుంబ అవసరాల కోసం మరింత అప్పు చేశాడు. అప్పులు ఎలా తీర్చాలంటూ తరచూ కుటుంబసభ్యులతో మథనపడే వాడు. ఈక్రమంలోనే శుక్రవారం ఆయన భార్య స్నానం చేయడానికి వెళ్లగానే మగ్గానికే తాడుతో ఉరి వేసుకున్నాడు. కొద్దిసేపటి తరువాత భార్య వచ్చి చూడగా, విగతజీవిగా ఉరికి వేలాడుతున్న భర్త కనిపించాడు. టూటౌన్ పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేసుకున్నారు.

## దేవరకొండపై పునుగుపిల్లి కళేబరం


పరిశీలిస్తున్న అటవీశాఖ అధికారులు

బుక్కరాయసముద్రం, డిసెంబరు5(ఆంధ్రజ్యోతి): అరుదుగా కనిపించే పునుగుపిల్లి మండలకేంద్రం సమీపంలోని దేవరకొండపై అనుమానాస్పద స్థితిలో మృతి చెంది కనిపించింది. ఎంతో విశిష్టమైన పునుగుపిల్లి ఆనవాళ్లు దేవరకొండపై ఉండటంతో భక్తులు ఇన్నాళ్లు ఆనందం వ్యక్తం చేశారు. కానీ ఇప్పుడు అది మృతి చెందిందన్న వార్త వారిని ఆవేదనకు గురిచేసింది. మృతి చెందిన పునుగు పిల్లి శరీరంపై అనేక చోట్ల కాట్లు, గాయాలు ఉండటం పలు అనుమానాలకు తావిస్తోంది. ఇది కుక్కల దాడిలో చనిపోయిందా? వేటగాళ్ల చేతిలో బలి అయ్యిందా? అన్నది ప్రశ్నార్థకంగా మారింది. మృతి చెందిన పునుగు పిల్లి కళేబరాన్ని అనంతపురం జిల్లా అటవీశాఖ అధికారులు పరిశీలించి, పోస్టు మార్టం నిర్వహణకు తరలించారు.

## గంగదేవిపల్లిని సందర్శించిన ఏపీ వాసులు


గంగదేవిపల్లిలో సీడీసీ సభ్యులు

గీసుగొండ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): వరంగల్ జిల్లా గీసుగొండ మండలంలోని జాతీయ ఆదర్శ గ్రామం గంగదేవిపల్లిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని సత్యసాయి, అనంతపురం జిల్లాలకు చెందిన అగలి, పుట్లూరు మండలాల నుంచి 40 మంది కమ్యూనిటీ డెవలప్‌మెంట్ కమిటీ సభ్యులు శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా ట్రెయినింగ్ మేనేజర్ కూసం రాజమౌళి గంగదేవిపల్లి నూతన గ్రామపంచాయతీ ఏర్పడిన తీరు, గ్రామాభివృద్ధిని, ప్రజల స్వచ్ఛంద భాగస్వామ్యం, సాధించిన అవార్డుల గురించి బృందానికి వివరించారు. ఈ కార్యక్రమంలో రాయలసీమ డెవలప్‌మెంట్ ట్రస్ట్ సభ్యుడు రామాంజనేయులు, రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ ప్రోగ్రాం ఆఫీసర్ ఓబలేష్, కొట్టె రమాదేవి, ఆర్పీలు మేడిద సుశీల, గూడ సరోజన తదితరులు పాల్గొన్నారు.

## అనంత, కడప దేవదాయ అధికారుల మార్పు

అమరావతి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): దేవదాయ శాఖ రాష్ట్రంలోని ఇద్దరు జిల్లా శాఖ అధికారులను మార్చింది. కడప జిల్లా ఎండోమెంట్ అధికారి పి.మల్లికార్జున ప్రసాద్‌ను అనంతపురం జిల్లాకు అదే స్థానంలో బదిలీ చేసింది. అలాగే అల్లాడుపల్లి వీరభద్రస్వామి దేవస్థానం ఈవో సి.శంకర బాలాజీకి కడప జిల్లా దేవదాయశాఖ అధికారిగా అదనపు బాధ్యతలు అప్పగించింది. ఈ ఉత్తర్వులను వెంటనే అమలు చేయాలని దేవదాయ శాఖ కమిషనర్‌ను ఆదేశిస్తూ, ఆ శాఖ కార్యదర్శి హరిజవహర్‌లాల్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

## స్థూల విలువపై రైతు సేవాకేంద్రాల సిబ్బందికి శిక్షణ

అమరావతి, డిసెంబరు5(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ రంగంలో స్థూల విలువ, రైతులకు నికరాదాయం పెరిగేలా వ్యవసాయశాఖ కసరత్తు చేపట్టింది. ఈ నెల 3న నల్లజర్లలో రైతన్నా మీకోసం' వర్క్‌షాప్‌లో సీఎం చంద్రబాబు ప్రకటించిన పంచ సూత్రాల అమలుకు అధికారులు కార్యాచరణ చేపట్టారు. గేట్స్ ఫౌండేషన్ తోడ్పాటుతో ఆతెన ఇన్ఫోనోమిక్స్ ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ సాంకేతిక సహకారంతో స్థూల విలువ, నికరాదాయం అనే అంశంపై రైతు సేవా కేంద్రాల సిబ్బందికి శిక్షణ ఇవ్వాలని వ్యవసాయశాఖ నిర్ణయించింది. దీనిపై శుక్రవారం మంగళగిరిలోని వ్యవసాయ శాఖ ప్రధాన కార్యాలయంలో డైరెక్టర్ మనజీర్ జిలానీ ఇన్ఫోనోమిక్స్ ప్రాజెక్ట్ సిబ్బందితో సమావేశమయ్యారు. పంట ఉత్పత్తులకు మార్కెటింగ్ కల్పించడం, పంటకు విలువ జోడించడం, రైతుకు నికరాదాయం లభించేలా చర్యలు తీసుకోవడం, స్థూల విలువ లెక్కించడంపై రైతు సేవా కేంద్రాల సిబ్బందికి శిక్షణ ఇవ్వనున్నట్టు డైరెక్టర్ తెలిపారు.

## 15 నుంచి ఆక్వా అథారిటీ సవరణ చట్టం అమలు

అమరావతి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ఆక్వాకల్చర్ డెవలప్‌మెంట్ అథారిటీ (సవరణ) చట్టం-2025 (యాక్ట్30 ఆఫ్ 2025)లోని అన్ని నిబంధనలు ఈనెల15 నుంచి అమల్లోకి వస్తాయని ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు శుక్రవారం ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్ నోటిఫికేషన్ జారీ చేశారు. గత ప్రభుత్వం తెచ్చిన ఆంధ్రప్రదేశ్ ఆక్వాకల్చర్ డెవలప్‌మెంట్ అథారిటీ (అప్సడా) చట్టం-2020లో కూటమి ప్రభుత్వం కొన్ని సవరణలు చేసింది. ఆక్వా రైతుల రిజిస్ట్రేషన్, లైసెన్సుల జారీ, ఆక్వా సాగు పద్ధతులు, ఆక్వా యూనిట్లకు ఆడిట్ నిబంధనల్లో మార్పులు, మత్స్య శాస్త్రాన్ని పశువైద్య విశ్వవిద్యాలయ నియంత్రణ నుంచి మత్స్యవర్సిటీ నియంత్రణలోకి తెచ్చేలా అంశాల్లో సవరణలు చేసినట్టు సమాచారం.

## టమోటా కిలో రూ.34



అనంతపురంరూరల్, డిసెంబరు5 (ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మార్కెట్లో శుక్రవారం టమోటాలు కిలో గరిష్ఠంగా రూ.34తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు. కనిష్ఠంగా రూ.14తో, సరసరిగా రూ.24తో విక్రయాలు జరిగాయన్నారు. మార్కెట్‌కు 1275 టన్నుల టమోటాలు వచ్చాయన్నారు.

# రైతు కుటుంబానికి అండగా ఉంటాం

### టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ

### ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబ సభ్యులకు పరామర్శ


రైతు కుటుంబ సభ్యులను ఓదారుస్తున్న ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ

అనంతపురం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఆత్మహత్య చేసుకున్న పుట్లూరు మండలం ఎల్లుట్ల గ్రామానికి చెందిన రైతు నాగలింగం కుటుంబానికి అండగా ఉంటామని టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి పేర్కొన్నారు. రైతు నాగలింగ ఆత్మహత్యకు పాల్పడ్డారన్న సమాచారంతో వారు శింగనమల మార్కెట్ యార్డు చైర్మన్ దండు శ్రీనివాసులు మరికొందరు టీడీపీ నాయకులతో కలిసి శుక్రవారం అనంతపురం ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి వెళ్లారు. రైతు మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. బాధిత రైతు కుటుంబ సభ్యులను కలిసి, ఆత్మహత్యకు కారణాలపై ఆరా తీశారు. ప్రభుత్వం అండగా ఉంటుందని, భరోసా ఇచ్చారు. పోస్టుమార్టం పూర్తయిన వెంటనే మృతదేహాన్ని ఎల్లుట్లకు తరలించారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ రైతు నాగలింగం తోటి రైతుల అరటి పంటను కొనుగోలు చేసి, వ్యాపారం చేయడం వల్ల నష్టపోయి అప్పులపాలయ్యాడన్నారు. తనకున్న ఎకరాలోపు పొలంతోపాటు మరో 3 ఎకరాలు కౌలుకు తీసుకొని, అరటి పంట సాగు చేసి, ధరలేక నష్టపోవడంతో అప్పులు అధికమయ్యాయని తెలిపారు. ఈక్రమంలో రైతు ఆత్మహత్యకు పాల్పడటం తమకెంతో బాధ కలిగిస్తోందన్నారు. రైతు ఆత్మహత్యను వైసీపీ నాయకులు రాజకీయాల కోసం వాడుకోవడం సిగ్గుచేటని మండిపడ్డారు. రైతు ఆత్మహత్యకు రాష్ట్ర ప్రభుత్వానిదే బాధ్యత అన్నట్లుగా మాట్లాడటం సరైంది కాదన్నారు. స్వయంగా రైతు నాగలింగం తన వ్యాపార నష్టాలు, ఆర్థికంగా ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఆయన కుటుంబ సభ్యులకు వాయిస్ మెసేజ్ పంపి, ఆత్మహత్య చేసుకున్నారని తెలిపారు. రైతుల గురించి మాట్లాడే హక్కు వైసీపీకి లేదన్నారు.

### రైతు కుటుంబానికి మంత్రి అచ్చెన్న భరోసా

రైతు నాగలింగ ఆత్మహత్యకు పాల్పడటం బాధాకరమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు శుక్రవారం ఓ ప్రత్యేక ప్రకటనలో పేర్కొన్నారు. బాధిత రైతు కుటుంబానికి మంత్రి సానుభూతి వ్యక్తం చేశారు. రైతు నాగలింగం అరటి సాగుతో పాటు వ్యాపారం చేయడం వల్ల నష్టపోయి, ఆత్మహత్యకు పాల్పడినట్లు తనకు సమాచారం ఉందన్నారు. వైసీపీ పాలనలో అరటి పంటకు సరైన ధరలు లేకపోవడం, ఎగుమతి చేసిన పంటకు చెల్లింపులు లేకపోవడం వల్లే ఆయన ఆర్థిక పరిస్థితి తీవ్రంగా దెబ్బతిందన్నారు. బాధిత రైతు కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని ఆయన భరోసా నిచ్చారు. శవరాజకీయాలకు అలవాటుపడిన వైసీపీ నాయకులు రైతు ఆత్మహత్యను కూడా అలానే చేస్తున్నారన్నారు. వక్రీకరించి, ప్రభుత్వానికి ముడిపెట్టడం దారుణమన్నారు.

### ఎమ్మెల్యే వర్సెస్ మాజీ మంత్రి

అనంతపురం వైద్యం: అరటి రైతు నాగలింగం మృతదేహం పోస్టుమార్టంపై శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ, మాజీ మంత్రి డాక్టర్ శైలజానాథ్ మధ్య చిన్నపాటి వాగ్వాదం నెలకొంది. శుక్రవారం ఉదయం ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ సర్వజన వైద్యశాలకు చేరుకుని బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చారు. అనంతరం ఆస్పత్రికి వచ్చిన మాజీ మంత్రి డాక్టర్ శైలజానాథ్.. 'రాత్రే మరణించాడు, పాయిజనింగ్ కేసు, బ్యాక్టీరియా పట్టదు, స్మెల్‌రాదు, చూద్దామని వచ్చా. అప్పుడే పోస్టుమార్టానికి పంపించారేంట'ని అధికారులను ప్రశ్నించారు. బంధువుల అభ్యర్థన మేరకు డాక్టర్లు శుక్రవారం ఉదయమే పోస్టుమార్టం నిర్వహించారనీ, నాగలింగం కుటుంబ సభ్యులకు ఉద్యోగాలు వచ్చే వరకు అండగా ఉంటామని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ అన్నారు. ఇంకా ఏమైనా సలహాలిచ్చినా తీసుకుంటామని మాజీ మంత్రి శైలజనాథ్‌కు తెలిపారు. 'పరవాలేదమ్మా.. ప్రజాప్రతినిధిగా మీ బాధ్యత అది' అంటూ శైలజానాథ్ బదులిచ్చారు. అనంతరం ఇరువురు అక్కడి నుంచి వెళ్లిపోయారు.

### అంత్యక్రియలు పూర్తి

పుట్లూరు: మండలంలోని ఎల్లుట్లలో టీడీపీ నాయకులు దగ్గరుండి ఆత్మహత్యకు పాల్పడిన రైతు నాగలింగం అంత్యక్రియలను శుక్రవారం పూర్తి చేయించారు. సుమారు రూ.30వేలను కుటుంబ సభ్యులకు అందించారు. ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ రూ.20 వేలు, శింగనమల మార్కెట్‌యార్డు చైర్మన్ దండు శ్రీనివాసులు ఆర్థికసాయం అందజేశారు.

### దురదృష్టకరం: వైసీపీ నాయకులు

అరటిరైతు ఆత్మహత్య చేసుకోవడం దురదృష్టకరమని వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి, శింగనమల నియోజకవర్గ ఇన్‌చార్జ్ శైలజానాథ్ పేర్కొన్నారు. మృతుడి కుటుంబానికి రూ.25లక్షల పరిహారాన్ని ఇవ్వాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# కంబదూరం

### పని చేయడానికి జంకుతున్న సెక్రటరీలు

### పంచాయతీల్లో అక్రమాల నేపథ్యంలోనే వెనుకంజ

### కంబదూరు మండలం నుంచి డెప్యుటేషన్‌పై వెళ్లే యత్నం



అనంతపురం న్యూటౌన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) జిల్లాలోని కంబదూరు మండలంలో పని చేయడానికి కార్యదర్శులు జంకుతున్నారు. ప్రధానంగా ఆ మండలంలో పని చేసిన పంచాయతీ కార్యదర్శి అశ్వత్థరెడ్డి అక్రమాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తుండటంతో అక్కడికి బదిలీపై వెళ్లిన సిబ్బంది పని చేయడానికి జంకుతున్నారన్న ప్రచారం జరుగుతోంది. సిబ్బంది కొరత కారణంగా మండలంలోని రాళ్ల అనంతపురం పంచాయతీ కార్యదర్శిగా ఉన్న అశ్వర్థరెడ్డికి కురాకులపల్లి, చెన్నంపల్లి, కర్తనపర్తి పంచాయతీలు కూడా గతంలో ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. అయితే గ్రేడ్-4 కార్యదర్శి అయిన అశ్వత్థరెడ్డికి గ్రేడ్-3 కార్యదర్శిగా ప్రమోషన్ ఇచ్చి, కంబదూరు పంచాయతీకి నియమించారు. ఇదే క్రమంలో ఆయన ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వహిస్తున్న పంచాయతీలకు సైతం రెగ్యులర్ కార్యదర్శులను నియమించారు. కురాకులపల్లి పంచాయతీకి శ్రీరాములు, చెన్నపల్లి పంచాయతీకి అశోక్, రాళ్ల అనంతపురం పంచాయతీకి మహేంద్రరెడ్డి, కర్తనపర్తి పంచాయతీకి రామ్మోహన్‌ను నియమించారు. వారంతా అక్టోబరు 28న బాధ్యతలు చేపట్టారు. అయితే వారికి బాధ్యతలు అప్పగించకుండా నవంబరు 27 వరకు ముప్పుతిప్పలు పెట్టాడన్న ఆరోపణలు అశ్వత్థరెడ్డిపై ఉన్నాయి.

### డిప్యూటీ ఎంపీడీఓకు తలనొప్పి..

సీనియర్ అసిస్టెంట్ నుంచి డిప్యూటీ ఎంపీడీఓగా ప్రమోషన్‌పై వెళ్లిన లీలాబాయికి సైతం ఆ మండలంలో ఈయన తలనొప్పిగా మారారన్న ప్రచారం ఉంది. 'మండలంలోని అందరితోను పనులు చేయించగలుగుతున్నాం. కానీ అశ్వత్థరెడ్డితో చేయించలేకపోతున్నాం. అందుబాటులో ఉండడు. చెప్పినమాట వినడు' అని డీపీఓ నాగరాజనాయుడు తనిఖీకి వెళ్లినప్పుడు డిప్యూటీ ఎంపీడీఓ ఫిర్యాదు చేసినట్లు సమాచారం. దీన్ని తేలిగ్గా తీసుకున్న డీపీఓ తదనంతర కాలంలో కార్యదర్శి అశ్వత్థరెడ్డి వల్లే కమిషనర్‌తో చీవాట్లు తినాల్సి వచ్చింది. ఎట్టకేలకు డీపీఓ తీసుకోవాల్సిన క్రమశిక్షణ చర్యలు ఏకంగా కమిషనరే తీసుకొని అశ్వత్థరెడ్డిని గత నెల 27 సస్పెండ్ చేశారు. దీంతో స్థానికంగా బాధ్యతలు చేపట్టిన నూతన కార్యదర్శులు తమ పంచాయతీలో ఏమి జరిగిందన్నది ఒక్కొక్కటిగా పరిశీలించుకుంటూ వచ్చారు. దీంతో అశ్వత్థరెడ్డి అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. ఇందులో అక్కడ ఉన్న ఉన్నతాధికారులకు ఎంపీడీఓ సహా ఎవరి వాటాలు వారికి అందడంతో బయటకు పొక్కకుండా జాగ్రత్తలు చేపట్టారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇందులో కంప్యూటర్ ఆపరేటర్ కీలకంగా వ్యవహరించారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే కంప్యూటర్ ఆపరేటర్‌కు సంబంధించి నీ పాత్ర ఉన్నట్లు ఏమాత్రం తెలిసిన ఇక్కడ ఉండలేవని డిప్యూటీ ఎంపీడీఓ హెచ్చరించినట్లు సమాచారం.

### అక్రమాలు తేల్చే పనిలో...

కాగా అశ్వత్థరెడ్డి స్థానంలో నూతనంగా పంచాయతీల వారిగా బాధ్యతలు చేపట్టిన వారు గతంలో జరిగిన అక్రమాలు నిగ్గుతేల్చడంలో నిమగ్నం అయ్యారు. అయితే వారిపై వస్తున్న ఒత్తిళ్ల కారణంగా మాకొచ్చిన సమస్య ఎందుకు ఇక్కడ ఉండకుండా మరోప్రాంతానికి డెప్యుటేషన్‌పై వెళ్లిపోతే సరి అని భావించి, ఆ ప్రయత్నాల్లో ఉన్నట్లు చర్చ జరుగుతోంది. అందులో భాగంగానే నూతనంగా బాధ్యతలు చేపట్టిన కార్యదర్శుల్లో ఇద్దరు శుక్రవారం డీపీఓ నాగరాజునాయుడును కలిసి తమ గోడు చెప్పుకోవడానికి డీపీఓ కార్యాలయానికి వచ్చారు. డీపీఓ బిజీగా ఉండటంతో సంప్రదించకుండానే వెనుతిరగాల్సిన పరిస్థితి నెలకొంది.

# హత్యకేసు ఛేదింపు

### వివాహేతర బంధం నేపథ్యంలోనే దారుణం

### నలుగురు నిందితుల అరెస్టు



కేసు వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్

పుట్టపర్తిరూరల్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): బుక్కపట్నం మండలం మారాల రిజర్వాయర్‌లో ఆగస్టు 8న లభించిన గుర్తుతెలియని మృతదేహం కేసును ఛేదించినట్లు ఎస్పీ సతీష్‌కుమార్ పేర్కొన్నారు. నలుగురు నిందితులను అరెస్టు చేసి రిమాండుకు పంపినట్లు తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ విజయ్‌కుమార్, పుట్టపర్తి రూరల్ సీఐ సురేష్‌తో కలిసి కేసుకు సంబంధించిన వివరాలను ఆయన వెల్లడించారు. నల్లమాడ మండలం వంకరకుంట గ్రామానికి చెందిన రామనోల్ల గంగాభవానికి అదే ఊరికి చెందిన వడ్డే గంగాద్రితో వివాహేతర సంబంధం ఉండేది. విషయం తెలుసుకున్న ఆమె భర్త రామనోల్ల రామప్ప ప్రతిరోజు మద్యంసేవించి ఆమెను కొట్టేవాడు. ఇది భరించలేని గంగాభవాని తన భర్త అడ్డు తొలగించుకోవాలనుకుంది. ప్రియుడైన గంగాద్రితో తన భర్తను చంపాలని, అవసరమైన డబ్బు ఇస్తానని చెప్పింది. దీంతో గంగాద్రి వంకరకుంట గ్రామానికే చెందిన విష్ణుతో కలిసి రామప్పను చంపాలని సుపారీ కుదుర్చుకున్నారు. ఈక్రమంలోనే జూలై 23న రామప్పను చంపడానికి ప్రయత్నించి, విఫలమయ్యారు. దీంతో హత్యా పథకంలోకి మరో వ్యక్తి సుదర్శన్‌ను చేర్చుకున్నారు. పథకం ప్రకారం జూలై 27న ఇంటిలో నిద్రిస్తున్న రామప్ప తలపై ఇటుకలతో కొట్టి, ఊపిరి ఆడకుండా చేసి చంపేశారు. తర్వాత శవాన్ని సంచిలో పెట్టి మారాల రిజర్వాయర్‌లో పడేశారు. ఆగస్టు 8న మారాల రిజర్వాయర్‌లో తేలియాడుతున్న మృతదేహాన్ని చూసిన వీఆర్‌ఏ పుల్లప్ప బుక్కపట్నం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు, గుర్తుతెలియని మృతదేహంగా కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు ప్రారంభించారు. దీంతో వివరాలు వెలుగు చూశాయి. నిందితులను నల్లమాడ మండలం రెడ్డిపల్లి శివారులో అరెస్టు చేశారు. ఎలాంటి క్లూ లేకపోయినా నిందితులను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన సీఐ, ఎస్ఐలను వారి సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు.

## పంట మార్పిడితోనే అధిక దిగుబడులు

### జిల్లా వ్యవసాయశాఖ అధికారి ఉమామహేశ్వరమ్మ



మాట్లాడుతున్న ఉమామహేశ్వరమ్మ

గార్లదిన్నె, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): పంటల మార్పిడితో అధిక దిగుబడులు సాధ్యమని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఉమా మహేశ్వరమ్మ పేర్కొన్నారు. ప్రపంచ నేల దినోత్సవాన్ని పురస్కరించుకొని కనుంపల్లిలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. మట్టినమూనా పరీక్షలు తప్పకుండా చేయించుకోవాలని, దాని ఆధారంగానే పంటలకు మందులు, ఎరువులు వేయాలిన సూచించారు. ఒకే పంటను సాగుచేయడం ద్వారా నేలలో సారం తగ్గి దిగుబడులు తగ్గుతాయని, సేంద్రీయ వ్యవసాయపై దృష్టిసారించాలని అన్నారు. అనంతరం రైతులకు మొక్కలు అందచేశారు. కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం రెడ్డిపల్లి కో-ఆర్డినేటర్ డాక్టర్ మల్లీశ్వరీ, శాస్త్రవేత్త డాక్టర్ శశికళ, సే ట్రీస్ స్వచ్ఛంద సంస్థ సీఈఓ నారాయణస్వామి, వ్యవసాయ అధికారి సోమశేఖర్, సే ట్రీస్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు, ఏఈఓ హరి, విఏఏ నరేష్, రైతులు పాల్గొన్నారు.

## సహకార సంఘాల ఎన్నికలు వాయిదా

అనంతపురం అర్బన్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాథమిక గొర్రెల సహకార సంఘాల ఎన్నికలు వాయిదా పడ్డాయి. ఉమ్మడి జిల్లాలోని 55 ప్రాథమిక గొర్రెల సహకార సంఘాలకు శుక్రవారం ఎన్నికలు జరగాల్సి ఉంది. రొద్దం మండలం తురకలాపట్నం, శింగనమల మండలం సలకం చెరువు, కంబదూరు మండలం చెన్నంపల్లి, కుందుర్పి మండలం బెస్తరపల్లి, కనగానపల్లి మండలం దాదలూరు ప్రాథమిక గొర్రెల సహకార సంఘాలకు ఎన్నికలు జరగలేదు. పాత సంఘం నాయకులు తగిన రికార్డులు సమర్పించకపోవడం, ఇతర కారణాలతో ఈ ఎన్నికలు వాయిదా పడినట్లు సమాచారం. వీటితోపాటు మరికొన్ని సంఘాల ఎన్నికలు వాయిదాపడినట్లు తెలిసింది. పశుసంవర్థక శాఖ జేడీ కార్యాలయానికి ఎన్నికల అధికారులుగా వ్యవహరించిన వెటర్నరీ డాక్టర్లు ఎన్నికల నిర్వహణకు సంబంధించిన తగిన సమాచారం ఇవ్వడంలో నిర్లక్ష్యం వహించారు. ఎన్ని సంఘాల ఎన్నికలు వాయిదా పడ్డాయన్న పూర్తి సమాచారం ఇంకా తెలియడంలేదు. శనివారం పూర్తి స్థాయిలో సమాచారం అందే అవకాశం ఉందని జేడీ కార్యాలయవర్గాలు పేర్కొన్నాయి.

## డిగ్రీలో నలుగురు డిబార్

అనంతపురం ప్రెస్‌క్లబ్, డిసెంబరు5(ఆంధ్రజ్యోతి): ఎస్కేయూ పరిధిలో నిర్వహిస్తున్న డిగ్రీ సెమిస్టర్ 3, 5 పరీక్షల్లో నలుగురు విద్యార్థులను డిబార్ చేసినట్లు పరీక్షల విభాగం డైరెక్టర్ ఆచార్య జీవీ రమణ శుక్రవారం తెలిపారు. అనంతపురంలోని ఎస్ఎల్ఎన్ కళాశాలలో ఒకరు, హిందూపురంలోని బాలాజీ విద్యామందిర్‌లో ముగ్గురు విద్యార్థులు మాస్ కాపీయింగ్‌కు పాల్పడుతుండగా, గుర్తించి డిబార్ చేశామన్నారు.

## రేపు క్రీడాకారుల ఎంపిక పోటీలు

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): జిల్లాస్థాయి జూడో క్రీడాకారుల ఎంపిక పోటీలు ఆదివారం ఆర్డీటీ స్టేడియంలోని నిర్వహిస్తున్నట్లు జిల్లా జూడో అసోసియేషన్ కార్యదర్శి గోవిందు తెలిపారు. జూడో జూనియర్స్, క్యాడెట్ బాల, బాలికల క్యాటగిరిలలో ఈ ఎంపిక పోటీలు ఉంటాయన్నారు. ఆసక్తి, అర్హత గల క్రీడాకారులు జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డు, క్రీడాసామగ్రితో హాజరుకావాలన్నారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 19 నుంచి కర్నూలులో నిర్వహించే రాష్ట్ర స్థాయి జూడో చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటారని, వివరాలకు 99891 95158ను సంప్రదించాలని కోరారు.

## ఎంపీపీ ఎన్నికకు నోటిఫికేషన్

రామగిరి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): రామగిరి ఎంపీపీ ఎన్నికకు నోటిఫికేషన్ విడుదలైనట్టు ఎన్నికల అధికారి సంజీవయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం ఎంపీటీసీలతో ప్రత్యేక సమావేశం నిర్వహిస్తామని, అనంతరం ఎన్నికలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమానికి ఎంపీటీసీ సభ్యులు అందరూ తప్పక హాజరు కావాలన్నారు. ఎంపీపీ నాగమ్మ గత డిసెంబరు 30 మరణించడంతో ఈ ఎన్నిక అనివార్యమైంది. కాగా ఇప్పటికే నాలుగు సార్లు ఈ ఎన్నిక వాయిదా పడింది. ఇది ఐదోసారి. ఈ ఎన్నికకు హాజరు కావాలని సభ్యులకు నోటీసులు అందజేయడానికి వెళ్లగా కొందరు అందుబాటులో లేరు. గడిచిన నాలుగు సార్లుకూడా సభ్యులు ఎన్నికకు రాకుండా క్యాంపు రాజకీయాలకే పరిమితమయ్యారు.

## అంతర్జాతీయ పోటీలకు ఎంపిక


అనిల్

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు తలారి అనిల్ ఎంపికయ్యాడు. ఇతను కళ్యాణదుర్గం మండలం నారాయణపురం గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీ రామాంజినేయులు, లక్ష్మీదేవి కుమారుడు. ఫిబ్రవరిలో ఇండోనేషియాలో జరిగే అంతర్జాతీయ బాల్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీల్లో భారత్ తరపున పాల్గొంటున్నాడు. అనిల్‌ను బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ జాతీయ కార్యదర్శి రాజారాం, రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు విజయశంకర్ రెడ్డి, బాలాజీ, ఉపాధ్యక్షుడు గౌస్‌మొహిద్దీన్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఈశ్వరయ్య, వెంకటేశులు అభినందనలు తెలిపారు.

## ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షల షెడ్యూలు విడుదల

అమరావతి, డిసెంబరు5(ఆంధ్రజ్యోతి): వచ్చే ఏడాది మార్చిలో జరిగే పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల షెడ్యూలును ఓపెన్ స్కూల్ సొసైటీ శుక్రవారం ప్రకటించింది. మార్చి 16 నుంచి 28 వరకు ప్రతిరోజూ ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు టెన్త్ పరీక్షలు జరుగుతాయని తెలిపింది. ఇంటర్మీడియట్ పరీక్షలు మార్చి 2 నుంచి 13 వరకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు జరుగుతాయని వివరించింది. ఇంటర్ ప్రాక్టికల్స్ ఏప్రిల్ 11 నుంచి 18 వరకు జరుగుతాయని పేర్కొంది.



## కార్మికుల కడుపు కొడితే సహించం

### సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్


ఉపకమిషనర్‌కు సమస్యలు వివరిస్తున్న నాయకులు

అనంతపురం టౌన్, డిసెంబరు5(ఆంధ్రజ్యోతి): పారిశుధ్య కార్మికులను విధులనుంచి తొలగించి, వారి పొట్ట కొట్టాలని చూస్తే సహించేది లేదని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్ పేర్కొన్నారు. ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో 20 ఏళ్ల నుంచి పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులను రద్దు చేయడాన్ని నిరసిస్తూ సీఐటీయూ అనుబంధ ఏపీ మెడికల్, హెల్త్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులతో కలిసి శుక్రవారం జిల్లా కార్మిక శాఖ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాగేంద్రకుమార్ మాట్లాడుతూ... పారిశుధ్య కార్మికులు ప్రజాసేవే జీవితంగా చేసుకుంటూ తమ కుటుంబాలను పోషించుకుంటున్నారన్నారు. కరోనా మహమ్మారి సమయంలో ప్రాణాలకు తెగించి సేవ చేసిన ఇదే కార్మికులను నేడు వయస్సు పేరుతో తొలగించడం అన్యాయమన్నారు. డిగ్రీ ఉన్నా.. లేకున్నా 22 మంది సూపర్‌వైజర్లను తొలగించడం వారి కుటుంబాలను రోడ్డున పడేసే చర్య అన్నారు. పద్మావతి ఏజెన్సీ నిర్వాహకుడు భాస్కర్‌నాయుడు తీసుకుంటున్న అక్రమ నిర్ణయాలపై ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకోవాలని డిమాండ్ చేశారు. దేశ ప్రధాని నరేంద్రమోదీ.. పారిశుధ్య కార్మికుల పాదాలు కడిగి గౌరవించారనీ, నేడు వారిపై తిరుగుబాటు చేయడం దుర్మార్గమని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం జిల్లా కార్మికశాఖ ఉపకమిషనర్ లక్ష్మీనరసయ్యను కలిసి వినతిపత్రం అందజేసి సమస్యలు వివరించారు. దీనికి ఆయన స్పందిస్తూ సమస్య కేవలం జిల్లా పరిధిలో మాత్రమే కాదు, రాష్ట్రవ్యాప్తంగా ఉందని తెలిపారు. ఈ అంశాన్ని రాష్ట్ర అధికారుల దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఏపీ మెడికల్, హెల్త్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకుడు ఏజీ రాజమోహన్, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్‌వి నాయుడు, నగర కార్యదర్శి ముత్తుజ, కార్మిక ప్రతినిధులు నల్లమ్మ, దేవా నరేష్, పద్మావతి హౌస్ కీపింగ్ ఏజెన్సీ ప్రతినిధులు సాయితేజ, హరిప్రసాద్, జమ్మునాథ్, అతావుల్లా తదితరులు పాల్గొన్నారు.

## 'జగన్ మాటలు సిగ్గుచేటు'


మాట్లాడుతున్న నాగరాజు

అనంతపురం అర్బన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): బలహీన వర్గాలకు చెందిన ఐపీఎస్, మాజీ ఐఏఎస్ అధికారులపై వైసీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి నోటికి వచ్చినట్లు మాట్లాడటం సిగ్గుచేటని రిజర్వేషన్ల పరిరక్షణ సమితి వ్యవస్థాపకుడు పోతుల నాగరాజు మండిపడ్డారు. స్థానిక రిజర్వేషన్ల పరిరక్షణ సమితి కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. కళ్లు నెత్తికెక్కిన జగన్ బలహీన వర్గాలకు చెందిన ఐపీఎస్ అధికారి గోపినాథ్‌జెట్టి, మాజీ ఐఏఎస్ అధికారి క్రిష్టయ్యను వాడు వీడు అని అగౌరవంగా మాట్లాడటం నీతిమాలిన చర్య అన్నారు. వారికి జగన్ తక్షణమే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఇకపై ఇలాగే మాట్లాడితే సహించమని హెచ్చరించారు.

## అయ్యప్ప ఆలయానికి వంట సామగ్రి వితరణ


ఆలయానికి అందజేసిన వంటసామగ్రి

గార్లదిన్నె, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని గుణకరణ అయ్యప్ప స్వామి ఆలయానికి కత్రిమల హోటల్ నిర్వాహకుడు కాన సురేష్, పుష్పావతి దంపతులు రూ.లక్ష విలువజేసే వంట సామగ్రిని వితరణ చేశారు. శుక్రవారం సాయంత్రం వారు ఆలయంలోని అయ్యప్ప స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం ఆలయ కమిటీ అధ్యక్షుడు కొనిరెడ్డి భాస్కర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు నాగిరెడ్డికి వంట సామగ్రిని అందజేశారు. ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## వ్యక్తి ఆత్మహత్యాయత్నం

గార్లదిన్నె, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెనకచెర్ల గ్రామంలో రాము అనే వ్యక్తి శుక్రవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఇంటి వద్ద స్థలం విషయంలో రాముకు మరొకరికి చిన్నపాటి వివాదం జరిగింది. దీంతో మనస్థాపానికి గురైన అతను పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించినట్లు తెలిసింది. కుటుంబసభ్యులు వెంటనే 108 వాహనం ద్వారా అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

## అన్న క్యాంటీన్ల పరిశీలన

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక బళ్లారి రోడ్డులో ఉన్న అన్న క్యాంటీన్‌ను నగరపాలక సంస్థ కమిషనర్ బాలస్వామి, డిప్యూటీ కమిషనర్ పావని శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అక్కడి పరిసరాల పరిశుభ్రతను పరిశీలించారు. అనంతరం అల్పాహారం చేశారు. అలాగే మధ్యాహ్నం రైల్వేస్టేషన్ సమీపంలో ఉన్న అన్న క్యాంటీన్‌ను తనిఖీ చేసి అక్కడే భోజనం చేశారు.

## రైతు కుటుంబాన్ని ఆదుకోవాలి

● ఏపీ రైతుసంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి డిమాండ్

అనంతపురం టౌన్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): పుట్లూరు మండలం ఎల్లుట్ల గ్రామానికి చెందిన అరటి రైతు నాగలింగం ఆత్మహత్య చేసుకుని మృతిచెందడం బాధాకరమని, ఆయన కుటుంబాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని ఏపీ రైతుసంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక రైతుసంఘం కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రస్తుతం మార్కెట్లో అరటి ధరలు అమాంతం పడిపోవడంతో పంట అమ్ముకోలేక, చేసిన అప్పులు తీర్చే మార్గంలేక రైతు నాగలింగం ఆత్మహత్య చేసుకునే పరిస్థితి వచ్చిందన్నారు. ఇది ముమ్మాటికీ ప్రభుత్వ హత్యేనని ఆరోపించారు. జిల్లాలో రైతుల పరిస్థితి రోజురోజుకీ దయనీయంగా మారుతోందన్నారు. చేతికొచ్చిన పంటలు అమ్ముకునే సమయానికి గిట్టుబాటు ధరలు లభించడం లేదని, ఈ క్రమంలోనే అప్పుల భారం మోయలేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అరటి, మొక్కజొన్న, పత్తి, వరి, కంది పంటలను రాష్ట్ర ప్రభుత్వం గిట్టుబాటు ధరతో కొనుగోలు చేయాలని, అలాగే రైతు నాగలింగం కుటుంబాన్ని దత్తత తీసుకుని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. సంఘం జిల్లా అధ్యక్షుడు బీహెచ్ రాయుడు, పండ్లతోటల రైతుసంఘం జిల్లా కార్యదర్శి శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా ఎన్నిక

కనగానపల్లి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రాథమిక గొర్రెల పెంపకందారుల సంఘం ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. కేఎన్ పాళ్యం గొర్రెల సంఘం అధ్యక్షుడిగా గౌని లక్ష్మిరెడ్డి, ఉపాధ్యక్షుడిగా నారాయణప్ప ఎన్నికయ్యారు. అలాగే భానుకోటకు పల్లా ఉమాపతి, బాలగోపాల్, కొండపల్లికి బండి జయరాములు, రమాదేవి, దాదులూరుకు గంగాధర్, బయన్నను సంఘ సభ్యులు ఓటింగ్ ద్వారా ఎన్నుకున్నారు. ఎన్నికైన వారిని మార్కెట్ చైర్మన్ బోయపాటి సుధాకర్ చౌదరి, టీడీపీ మండల కన్వీనర్ యాతం పోతలయ్య, మాజీ సర్పంచ్ రామసుబ్బయ్య తదితరులు అభినందించారు.

● చెన్నేకొత్తపల్లి:మండలంలోని హరియన్ చెరువు గ్రామంలో కనకదాస గొర్రెల పెంపకం దారుల సంఘం ఎన్నికను నిర్వహించారు. అధ్యక్షురాలుగా గంగమ్మ, ఉపాధ్యక్షురాలిగా తులసమ్మతోపాటు ఐదుగురి డైరెక్టర్లను ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారి సునీల్ తెలిపారు. కార్యక్రమంలో వెటర్నరీ అసిస్టెంట్ కల్పన, టీడీపీ నాయకులు ముత్యాలప్ప, రాజు, ఆదినారాయణ, రామచంద్ర, రామాంజి, నరసింహులు పాల్గొన్నారు.

## స్వమిత్వ సర్వేపై గ్రామసభ

అనంతపురంరూరల్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని మన్నీలలో స్వమిత్వ సర్వేపై శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. సర్పంచు త్రిలోక్ నాయుడు అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి డిప్యూటీ ఎంపీడీఓ వెంకటనాయుడు హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమం ద్వారా గ్రామాల్లోని ప్రజల ఆస్థులను సర్వే చేసి మ్యాపింగ్ చేస్తున్నామన్నారు. తద్వారా గ్రామస్థులకు వారి ఆస్తికి సంబంధించిన చట్టపరమైన పత్రాలు అందజేస్తామన్నారు. దీని ద్వారా ఆస్తి యాజమాన్యంపై స్పష్టత వస్తుందన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి హేమావతి, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి షెక్షావలి నాయుడు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## ఫీజు బకాయిలను వెంటనే చెల్లించాలి

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఉన్నత విద్యనభ్యసించే పేద విద్యార్థులకు ఫీజు రీయింబర్స్ మెంట్ చెల్లించకుండా కూటమి ప్రభుత్వం కాలయాపన చేస్తుండడం తగదని, వెంటనే చెల్లించాలని నగర మేయర్ మహ్మద్ వసీం డిమాండ్ చేశారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం పేదవిద్యార్థులకు ఫీజురీయింబర్స్‌మెంట్ రూ.7800 కోట్లు పెండింగ్‌లో పెట్టిందన్నారు. అయా కళాశాలల యాజమాన్యాలు ఫీజుల కోసం విద్యార్థులపై తీవ్ర ఒత్తిడి చేస్తున్నాయని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వ స్పందించాలని కోరారు. సమావేశంలో కార్పొరేటర్లు శ్రీనివాసులు, రహంతుల్లా, కమల్‌భూషణ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయంతో మంచి దిగుబడులు

ఆత్మకూరు, డిసెంబరు5(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంతో మంచి దిగుబడులు సాధించవచ్చని ఏఎఫ్ ఎకాలజీ సంస్థ వ్యవసాయ నిపుణులు వీరభద్రారెడ్డి సూచించారు. మండలంలోని పి.యాలేరు గ్రామంలో శుక్రవారం ఆయన ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తొలుత శ్రీలత అనే మహిళా రైతు ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగు చేస్తున్న పంటలను పరిశీలించారు. అనంతరం ప్రకృతి వ్యవసాయ పంటలు పండించే విధానాన్ని రైతులకు వివరించారు. ఆ పంటలకు మంచి డిమాండ్ ఉంటుందన్నారు. రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గు చూపాలన్నారు. ఏఎఫ్ ఎకాలజీ ప్రతినిధులు రుద్రయ్య, ఓబులపతి, వివేకానంద, సబిహా, రాజు, మంజు తదితరులు పాల్గొన్నారు.

# విద్యకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట

● మెగా పీటీఎంలో కలెక్టర్ ఆనంద్


పాఠశాలలో సైన్స్ ఎగ్జిబిషన్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్

ఆత్మకూరు డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): విద్యకు రాష్ట్ర ప్రభుత్వం పెద్ద పీట వేసిందని, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు విద్యార్థుల భవిష్యత్తును ఉన్నతంగా తీర్చి దిద్దాలని కలెక్టర్ ఆనంద్ సూచించారు. మండలకేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం జరిగిన మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్‌కు కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. తొలుత పాఠశాలలో ఏర్పాటు చేసి హెల్త్ క్యాంపును, వాటర్ ప్లాంట్‌ను పరిశీలించారు. ఆవరణలో మొక్కలు నాటారు. విద్యార్థుల ప్రదర్శించిన సైన్స్ ఎగ్జిబిషన్‌ను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ఈ సమాశాలకు తల్లిదండ్రులు హాజరై పిల్లలు ఎలా చదువు తున్నారో ఉపాధ్యాయులను అడిగి తెలుసుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాల్లో మెరుగైన వసతులు కల్పించిందన్నారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకుని బాగా చదువుకోవాలని సూచించారు. తర్వాత పలు పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఏపీసీ శైలజ, హెచ్ఎం లక్ష్మీదేవి, స్కూల్ కమిటీ చైర్మన్ బొమ్మయ్య, సర్పంచ్ వరలక్ష్మి, ఎంపీపీ హేమలత, తహసీల్దార్ లక్ష్మీనాయక్, ఎంపీడీఓ లక్ష్మీనరసింహ, డిప్యూటీ ఎంపీడీఓ సాదిక్‌వలీ, ఎంఈఓ నరసింహ, టీడీపీ మండల కన్వీనర్ శ్రీనివాసులు, పార్లమెంట్ అధికార ప్రతినిధి శశాంక చౌదరి పాల్గొన్నారు.

**కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు: రాప్తాడు ఎమ్మెల్యే**

అనంతపురంరూరల్: కూటమి అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా రూపాంతరం చెందుతున్నాయని ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. మండలంలోని సిండికేట్ నగర్‌లో గల జడ్పీ పాఠశాలలో నిర్వహించిన మెగా పేరెంట్స్- టీచర్స్ మీటింగ్‌కు ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ముందుగా విజ్ఞాన ప్రదర్శనను తిలకించి వాటిని తయారు చేసిన విద్యార్థులను అభినందించారు. విలువలతో కూడిన విద్య అనే పుస్తకాన్ని విద్యార్థులకు అందజేశారు. అనంతరం మాట్లాడుతూ.. తల్లిదండ్రులు ఇలాంటి సమావేశాలకు వచ్చి పిల్లలు ఎలా చదువుకుంటున్నారన్నది తెలుసుకోవాలన్నారు. ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యతనిస్తోందన్నారు. విద్యాశాఖా మంత్రి నారా లోకేశ్ ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నారని చెప్పారు. పిల్లలు బాగా చదువుకోవాలని సూచించారు. తర్వాత పాఠశాల అభివృద్ధికి పరిటాల రవీంద్ర మెమోరియల్ ట్రస్ట్ ద్వారా రూ.లక్ష విరాళం ప్రకటించారు. ఇదే సందర్భంలో టీడీపీ నాయకులు రూ.3లక్షల వరకు అందజేశారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. పిల్లలతో కలిసి భోజనం చేశారు. విద్యాశాఖ అధికారులు, టీడీపీ మండల నాయకులు పాల్గొన్నారు.

**విద్యావ్యవస్థ బలోపేతమే ప్రభుత్వ లక్ష్యం: శింగనమల ఎమ్మెల్యే**

బుక్కరాయసముద్రం: రాష్ట్రంలో విద్యా వ్యవస్థను బలోపేతం చేసి, పేద విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ పేర్కొన్నారు. మండలంలోని కొర్రపాడు అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో నిర్వహించిన మెగా పేరెంట్స్ -టీచర్స్ మీటింగ్‌లో ఆమెతో పాటు టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి పర్వతనేని శ్రీధర్‌బాబు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారాలోకేష్ విద్యారంగానికి అధిక ప్రాధ్యానత ఇస్తున్నారని తెలిపారు. గతంలో ఎన్నడూలేనివిధంగా ప్రభుత్వ పాఠశాలల్లో మౌళిక వసతులు కల్పిస్తూ, విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించేందుకు ప్రత్యేక ప్రణాళికలతో ముందుకెళ్తున్నారని చెప్పారు. విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. తర్వాత పాఠశాలలో నిర్మించిన ఓపెన్ ఆడిటోరియంను ప్రారంభించారు. పిల్లలతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీధర్‌మూర్తి, ఎంపీడీఓ సాల్మన్‌రాజ్, ఎంపీపీ సునీత, టీడీపీ శ్రేణులు పాల్గొన్నారు.


అనంతపురంలోని శారదా నగరపాలక బాలికోన్నత పాఠశాలలో మాట్లాడుతున్న మాంసాభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రకాష్‌నాయుడు



నార్పల బాలికల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల ప్రగతి నివేదికలను చూస్తున్న డీఈఓ ప్రసాద్‌బాబు


కనగానపల్లిలోని ప్రభుత్వ పాఠశాలలో మాట్లాడుతున్న డీసీఎంఎస్ చైర్మన్ నెట్టెం వెంకటేష్, పక్కన రాప్తాడు మార్కెట్ యార్డు చైర్మన్ సుధాకర్

## ప్రభుత్వ బడుల్లో సందడే.. సందడి

● మెగా పీటీఎంలో పాల్గొన్న విద్యార్థుల తల్లిదండ్రులు, అధికారులు, ప్రజాప్రతినిధులు

న్యూస్‌నెట్‌వర్క్, ఆంధ్రజ్యోతి: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశాలు అనంతపురం అర్బన్, రాప్తాడు, శింగనమల నియోజకవర్గాల్లోని అన్ని సర్కారు పాఠశాలల్లో శుక్రవారం ఘనంగా జరిగాయి. పెద్దఎత్తున విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు. వక్తలు మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కూటమి ప్రభుత్వం విశేష కృషి చేస్తోందన్నారు. ప్రభుత్వం అందించే వసతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని బాగా చదువుకోవాలని సూచించారు. తల్లిదండ్రులు ఇలాంటి సమావేశాలకు వచ్చి తమ పిల్లల చదువుతీరును తెలుసుకోవాలని సూచించారు. అనంతరం పాఠశాలల్లో విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. పలుచోట్ల వైజ్ఞానిక ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంతో పాఠశాలల్లో సందడి నెలకొంది.



జిల్లాకేంద్రంలోని కేఎస్ఆర్ బాలికల ఉన్నత పాఠశాల పీటీఎంలో సెల్ఫీ తీసుకుంటున్న ఆర్టీసీ రీజనల్ చైర్మన్ పూల నాగరాజు


బీకేఎస్‌లోని ఎస్టీ గురుకుల పాఠశాలలో జరిగిన పీటీఎంలో టెన్త్ టాపర్‌ను సన్మానిస్తున్న ఎస్టీ కమిషన్ సభ్యుడు వెంకటప్ప

# ప్రజాసమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు

● ప్రజాదర్బార్‌లో అధికారులకు ఎమ్మెల్యే పరిటాల సునీత సూచన


వృద్ధురాలి నుంచి అర్జీ స్వీకరిస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

అనంతపురంరూరల్, డిసెంబరు5(ఆంధ్రజ్యోతి): ప్రజలు అర్జీల ద్వారా తెలియజేసే ప్రతి సమస్యకు అధికారులు త్వరగా పరిష్కరించాలని, నిర్లక్ష్యం చూపరాదని ఎమ్మెల్యే పరిటాల సునీత సూచించారు. మండలంలోని రాచానపల్లి పంచాయతీ కార్యాలయం వద్ద శుక్రవారం ఎంపీడీఓ దివాకర్ అధ్యక్షతన ప్రజా దర్బార్ జరిగింది. ఇందులో ఎమ్మెల్యే పాల్గొని గ్రామస్థుల నుంచి అర్జీలు స్వీకరించారు. ప్రధానంగా రోడ్లు, డ్రైనేజీలు, ఇల్లు, ఇళ్లపట్టాలు, పింఛన్ల మంజూరుతో పాటు రెవెన్యూ పరమైన సమస్యలపై ప్రజలు అర్జీలు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజాదర్బార్‌లో అర్జీ రూపంలో తెలియజేసిన ప్రతి సమస్యకు అధికారులు పరిష్కారం చూపాలన్నారు. కొన్ని సమస్యలు పరిష్కరించలేకపోతే ఎందుకున్నది కూడా వివరణ ఇవ్వాల్సి ఉంటుందన్నారు. ఇందులో నిర్లక్ష్యానికి తావు ఇవ్వకూడదని తెలిపారు. మండలం వేగంగా విస్తరిస్తున్న క్రమంలో ఈ ప్రాంతానికి తాగునీరు, రోడ్లు, డ్రైనేజీలు వంటి మౌళిక వసతుల కల్పనకు ప్రత్యేకంగా చొరవ చూపుతున్నట్లు ఈ సందర్భంగా ఆమె పేర్కొన్నారు. సిండికేట్ నగర్‌లో స్థల సేకరణ చేసి పార్కు కూడా ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ జింకాసూర్యనారాయణ, రాచనపల్లి సింగిల్ విండో అధ్యక్షుడు పాముారాయి రఘు, ఎంపీటీసీ సభ్యుడు కృష్ణారెడ్డి, రాప్తాడు మార్కెట్‌యార్డు డైరెక్టర్ బుల్లెట్ రఫీ, మండల వ్యవసాయాధికారి వెంకటకుమార్, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ హరికుమార్, పీఆర్ జేఈ వెంకటశేషయ్య, నాయకులు పాల్గొన్నారు.

## నగరాన్ని పరిశుభ్రంగా ఉంచాలి

● సిబ్బందికి ఏఎంసీ కమిషనర్ బాలస్వామి ఆదేశం


సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): అపరిశుభ్రతను పూర్తిగా తొలగించి నగరాన్ని పరిశుభ్రంగా ఉంచాలని నగరపాలక సంస్థ కమిషనర్ బాలస్వామి సిబ్బందిని ఆదేశించారు. స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలోని కౌన్సిల్‌హాల్‌లో శుక్రవారం ఆయన నగరంలో పారిశుధ్య నిర్వహణపై అధికారులు, సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు. నగరంలో పారిశుధ్యాన్ని మెరుగుపరచడమే లక్ష్యంగా శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లు, సెక్రటరీలు, సిబ్బంది ఉదయం 5గంటలకే విధులకు హాజరుకావాలని సూచించారు. ప్రజల నుంచి వినతుల రూపంలో వచ్చే సమస్యలను పరిగణలోకి తీసుకుని ఎప్పటికప్పుడు ఆయా ప్రాంతాల్లో మురుగు కాలవల పూడికతీత, ఇంటింటా చెత్త సేకరణ చేపట్టాలని సూచించారు. కుక్కల సమస్య పరిష్కారానికి 1నుంచి 10వడివిజన్ వరకు అనిమల్ బర్త్ కంట్రోల్ (ఏబీసీ) ఆపరేషన్ చేపడుతున్నట్లు చెప్పారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లు విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శించకుండా పనిచేయాలని సూచించారు. ఏఎంసీ డిప్యూటీ కమిషనర్ పావని, ఎస్ఈ రాజశేఖర్, ఎంహెచ్ఓ నరసింహులు, ఈఈ చంద్రశేఖర్, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లు, సెక్రటరీలు పాల్గొన్నారు.

## తాగునీటి ట్యాంకు ప్రారంభం


ట్యాంకును ప్రారంభిస్తున్న ముంటిమడుగు శ్రీనివాస్‌రెడ్డి

గార్లదిన్నె, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామదాసుపేట గ్రామంలో నిర్మించిన సత్యసాయి తాగునీటి ట్యాంకును శుక్రవారం మాజీ ఎంపీపీ ముంటిమడుగు శ్రీనివాస్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... జిల్లాలోని చాలా గ్రామాల్లో ప్రజల దాహార్తిని భగవాన్ సత్యసాయి బాబా తీర్చారని తెలిపారు. ఒక్క గార్లదిన్నె మండలంలోనే సుమారు 20 గ్రామాలకు సత్యసాయి తాగునీరు సరఫరా అవుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సర్పంచు రాధికమ్మ, టీడీపీ నాయకులు ఈశ్వర్‌రెడ్డి, నారపరెడ్డి, సురేంద్ర పాల్గొన్నారు.

## చౌడేశ్వరి ఆలయ కమిటీ సభ్యులకు సన్మానం


శ్రీనివాసులు, లోకేష్‌ను సన్మానిస్తున్న తొగటవీర క్షత్రియులు

అనంతపురం టౌన్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): నందవరం చౌడేశ్వరి దేవి ఆలయ కమిటీ సభ్యులుగా ఎన్నికైన చింతా శ్రీనివాసులు, ఎర్రజోడు లోకేశ్‌ను తొగటవీర క్షత్రియులు సన్మానించారు. స్థానిక బెంగళూరు రోడ్డులోని తొగటవీర క్షత్రియ కల్యాణ మండపంలో శుక్రవారం వారు శ్రీనివాసులు, లోకేశ్‌ను శాలువా, పుష్పగుచ్ఛాలతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో చౌడేశ్వరి దేవి కల్యాణమండపం అధ్యక్షుడు దాసరి శ్రీధర్, కార్యదర్శి వెంకటేశ్వర్లు, కోశాధికారి చౌడయ్య, చిదంబరయ్య, కామారపు గోపీకృష్ణ, బంధనాథం ఆంజనేయులు, సత్యనారాయణ, శ్రీరాములు, రెడ్డపరెడ్డి, మూలం చంద్రప్ప, విశ్రాంత టీచర్ మిట్టా శంకర్, బోనాల మారుతీప్రసాద్, శీలా జయరామప్ప, శంకర్, వెంకటపతి, అప్పేస్వామి, రాధాకృష్ణ పాల్గొన్నారు.

## గేదెను ఢీకొన్న ద్విచక్రవాహనం

● అన్న, తమ్ముడికి గాయాలు

గార్లదిన్నె, డిసెంబరు5(ఆంధ్రజ్యోతి): మండలంలోని కనుంపల్లి సమీపంలో గల 44వ జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి ద్విచక్ర వాహనం గేదెను ఢీ కొంది. ప్రమాదంలో బైక్‌పై ఉన్న అన్నదమ్ముళ్లకు గాయాలయ్యాయి. జిల్లాకేంద్రంలోని అశోక్‌నగర్‌కు చెందిన హేమంత్, విజయ్‌కుమార్ అన్నదమ్ములు. వీరు కసాపురం అంజనేయస్వామిని దర్శించుకునేందుకు ద్విచక్ర వాహనంలో శుక్రవారం రాత్రి బయలుదేరారు. కనుంపల్లి సమీపంలోకి రాగానే ఉన్నట్టుండి గేదె అడ్డు వచ్చింది. దానిని తప్పించే మార్గం లేక ఢీ కొట్టి పడిపోయారు. ప్రమాదంలో విజయ్‌కుమార్ తీవ్రంగా గాయపడగా.. హేమంత్ స్వల్పంగా గయపడ్డాడు. క్షతగాత్రులను స్థానికులు 108 వాహనం ద్వారా అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

## పరిటాల కుటుంబాన్ని విమర్శిస్తే ఖబడ్దార్

● మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డికి టీడీపీ నాయకుల హెచ్చరిక


మాట్లాడుతున్న టీడీపీ మండల కన్వీనర్ శ్రీనివాసులు

ఆత్మకూరు డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): తరచూ ప్రెస్‌మీట్లు పెట్టి పరిటాల కుటుంబంపై లేని పోని విమర్శలు చేస్తే సహించమని, ఖబడ్దార్ అంటూ మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డిని టీడీపీ నాయకులు హెచ్చరించారు. అనంతపురం నగరంలోని పరిటాల క్యాంపు కార్యాలయంలో శుక్రవారం పార్టీ మండల కన్వీనర్ శ్రీనివాసులు, టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్రనాయకుడు పరుశురామ్, పార్లమెంటు అధికార ప్రతినిధి శశాంక చౌదరి విలేకరులతో మాట్లాడారు. పరిటాల కుటుంబంపై లేనిపోని విమర్శలు చేస్తే సహించేది లేదన్నారు. గతంలో ఐదేళ్ల అధికారంలో ఉండి సొంత గ్రామాన్ని కూడా అభివృద్ధి చేయలేని దద్దమ్మ ప్రకాష్‌రెడ్డి అని విమర్శించారు. గ్రామాల్లో కక్ష్యలు, కార్పణ్యాలు ప్రోత్సహించడం తప్ప ఎలాంటి అభివృద్ధి చేపట్టలేదని మండిపడ్డారు. అమ్మ డెయిరీ పేరుతో మహిళల నుంచి రూ.10కోట్లువసూలు చేసింది, ఆలమూరు ఎర్రకొండ వద్ద వాల్మీకులను బెదిరించి భూమిని తక్కువ ధరకు కొన్నది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. అధికారంలో ఉన్నన్నాళ్లు అవినీతి అక్రమాలతో కాలం వెల్లదీసిన ప్రకాష్ రెడ్డి ఇప్పుడు ఎమ్మెల్యే పరిటాల సునీత చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక అవాకులు చవాకులు పేలుతున్నారని దుయ్యబట్టారు. ఇప్పటికైనా విమర్శలు మాని నియోజకవర్గ అభివృద్ధికి పాటు పడాలని హితవు పలికారు. మండల ప్రధాన కార్యదర్శి నరసింహ చౌదరి పాల్గొన్నారు.

## 12న విగ్రహావిష్కరణ


సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజేష్

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): నగరంలోని గుత్తిరోడ్డులో ఏర్పాటు చేసిన మాజీ ప్రధాని, భారతరత్న అటల్ బిహారీ వాజ్‌పాయ్ విగ్రహాన్ని ఈనెల 12వ తేదీన ఘనంగా ఆవిష్కరించనున్నట్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొనకొండ్ల రాజేష్ తెలిపారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, కూటమి నేతలు హాజరు కానున్నట్లు చెప్పారు. జిల్లా నలుమూలల నుంచి అధిక సంఖ్యలో కూటమి పార్టీల శ్రేణులు, ప్రజలు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాపు రామచంద్రారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి సందిరెడ్డి శ్రీనివాసులు, రాష్ట్ర సెల్స్ కన్వీనర్ చిరంజీవిరెడ్డి, ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు పంతాల సురేష్ , సీనియర్ నాయకులు ప్రతాపరెడ్డి, రత్నమయ్య, రామచంద్రయ్య, లక్ష్మీదేవి, లలిత్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## అగ్రికల్చర్ పాలిటెక్నిక్ కళాశాలలో నేల దినోత్సవం

రామగిరి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని అగ్రికల్చర్ పాలిటెక్నిక్ కళాశాలలో ప్రపంచ నేల దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రిన్సిపాల్ వెంకటరమణ మాట్లాడుతూ... నేల వ్యవసాయానికి ప్రధాన ఆధారమన్నారు. నేల ఆరోగ్యంగా ఉంటేనే పంట ఆరోగ్యంగా ఎదుగుతుందన్నారు. రసాయన ఎరువులను తగ్గించి, సేంద్రియాల వాడకాన్ని పెంచాలన్నారు. నేల పరీక్షలు చేయించడం వంటి చర్యలు భవిష్యత్తు వ్యవసాయాన్ని రక్షిస్తాయని పేర్కొన్నారు. అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడిగా నాగేంద్రకుమార్

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడిగా నాగేంద్రకుమార్ నియమితులయ్యారు. నాయీబ్రాహ్మణుడైన అతడిని ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడిగా రెండోసారి నియమిస్తూ బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొనకొండ్ల రాజేష్ శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో నియామకపత్రం అందజేశారు.

## అబ్దుల్ కలాం విగ్రహం ఏర్పాటుకు రూ.లక్ష విరాళం

ఆత్మకూరు డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం జరిగిన మెగా పీటీఎంకు వచ్చిన కలెక్టర్ ఆనంద్ చేతులమీదుగా పాఠశాలలో మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం విగ్రహం ఏర్పాటుకు పరిటాలరవీంద్ర మెమోరియల్ ట్రస్టుద్వారా టీడీపీ నాయకులు రూ. లక్ష విరాళాన్ని ఉపాధ్యాయులుకు అందజేశారు. పాఠశాలలో విగ్రహం ఏర్పాటుకు ఎమ్మెల్యే పరిటాల సునీత ఇదివరకు హామీ ఇచ్చారు. ఆ హామీ మేరకు రాళాన్ని అందజేసినట్లు టీడీపీ నాయకులు తెలిపారు. మండల కన్వీనర్ శ్రీనివాసులు, పార్లమెంటు అధికార ప్రతినిధి శశాంక చౌదరి, స్కూల్ కమిటీ చైర్మన్ బొమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## క్రికెట్ పోటీల్లో ఓటీపీఆర్ఐ విద్యార్థుల సత్తా

అనంతపురం ప్రెస్‌క్లబ్, డిసెంబరు5(ఆంధ్రజ్యోతి): జాతీయ ఫార్మసీ వారోత్సవాలలో భాగంగా నిర్వహించిన క్రికెట్ పోటీల్లో జేఎన్‌టీయూ(ఏ) ఓటీపీఆర్ఐ కళాశాల విద్యార్థులు సత్తా చాటారు. ఈ మేరకు శుక్రవారం జరిగిన ఫైనల్ క్రికెట్ పోటీల్లో జేఎన్‌టీయూ ఓటీపీఆర్ఐ విద్యార్థులు, ఎస్కేయూ ఫార్మసీ కళాశాల విద్యార్థులను ఆరు వికెట్ల తేడాతో ఓడించి విజేతలుగా నిలిచారు. ఈ సందర్భంగా ఓటీపీఆర్ఐ డైరెక్టర్ ఆచార్య జీవీ సుబ్బారెడ్డి , ఓటీపీఆర్ఐ క్రికెట్ జట్టు కెప్టెన్, సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయుడు ధనుంజయ, ప్రిన్సిపల్ గోపీనాథ్, డిప్యూటీ రిజిస్ట్రార్ దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


విజేత జట్టును అభినందిస్తున్న డైరెక్టర్ సుబ్బారెడ్డి, ప్రిన్సిపాల్, డిప్యూటీ రిజిస్ట్రార్ తదితరులు

న్యూస్ బాక్స్

## తాగునీటి కోసం రాస్తారోకో



రోడ్డుపై బైఠాయించిన మహిళలు

కుందుర్పి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): నెల రోజులుగా తాగునీటి సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నా.. ఎవరూ పట్టించుకోవడం లేదని స్థానిక విద్యుత్ నగర్ మహిళలు మండిపడ్డారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక కెనరా బ్యాంకు సమీపంలో రాస్తారోకో చేపట్టారు. ప్రధాన రహదారిపై ఖాళీ బిందెలతో నిరసన చేపట్టారు. దీంతో వాహనాలు నిలిచిపోవడంతో ట్రాఫిక్‌సమస్య నెలకొంది. ట్రైనీ ఎస్ఐ చిన్నరాయుడు సంఘటన స్థలానికి చేరుకుని.. సంబంధిత అధికారులతో మాట్లాడారు. రెండు రోజుల్లో ఆ కాలనీలో తాగునీటి సమస్య పరిష్కరిస్తామని ఆ అధికారులు హామీ ఇచ్చారు. దీంతో మహిళలు శాంతించారు. రెండురోజుల్లో సమస్య పరిష్కారం కాకపోతే మండల కార్యాలయం ఎదుట నిరసన చేపడతామన్నారు.

### రేపు ఉచిత గ్యాస్‌పై సమావేశం

గుంతకల్లు, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఉచిత గ్యాస్ పథకంలో సమస్యలు, అనుమానాల నివృత్తి కోసం ఆదివారం గ్యాస్ ఏజెన్సీ డీలర్ల సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు తహసీల్దారు రమాదేవి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు స్థానిక ఆర్ అండ్ బీ బంగ్లాలో ఈ సమావేశాన్ని నిర్వహిస్తామని, ఉచిత గ్యాస్‌కు సంబంధించిన డబ్బు ఖాతాల్లో జమకానివారు, ఏవైనా అనుమాలు ఉంటే నివృత్తి చేసుకోవడానికి వినియోగదారులు రావాలని తెలిపారు. రేషన్ కార్డు, ఆధార్ కార్డు, గ్యాస్ కనెక్షన్ పుస్తకం, గ్యాస్ ఖాతాకు లింక్ చేసిన సెల్ ఫోన్‌ను వెంట తీసుకురావాలన్నారు.

### విద్యార్థులకు ప్లేట్ల పంపిణీ

యాడికి, డిసెంబరు5(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల నెంబర్-1లోని విద్యార్థులకు ఎస్‌బీఐ మేనేజర్ (సర్వీసెస్) రామలింగేశ్వరబాబు భోజనం ప్లేట్లను శుక్రవారం పంపిణీ చేశారు. రూ.11వేలు విలువగల 100 ప్లేట్లను ఆయన అందజేశారు.

### ఆర్థిక సాయం అందజేత

గుంతకల్లుటౌన్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): స్థానిక భాగ్యనగర్‌కు చెందిన బెల్దారి కావలి పురుషోత్తం నవంబరు 20న ఆటో బోల్తా పడిన సంఘటనలో కాలు విరిగి ఆపరేషన్ చేయించుకున్నాడు. దీంతో అతనికి ఆ నలుగురు సేవాసమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మంజుల వెంకటేష్ శుక్రవారం రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఇందులో ఆ సమితి సభ్యులు చక్రీ, రమేష్, భాస్కర్, కల్యాణ్ కారి లలిత్‌కుమార్, స్వాతిక్ పాల్గొన్నారు.

### రైతు ఆత్మహత్యను రాజకీయం చేయొద్దు

పుట్లూరు, డిసెంబరు5(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎల్లుట్ల గ్రామానికి చెందిన అరటి రైతు నాగలింగం ఆత్మహత్యను రాజకీయం చేయడం తగదని టీడీపీ మండల కన్వీనర్ గుత్తా శ్రీనివాసులునాయుడు పేర్కొన్నారు. శుక్రవారం ఎల్లుట్లలో రైతు నాగలింగం అంత్యక్రియలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ బాధిత కుటుంబానికి అండగా ఉన్నారన్నారు. ఉదయాన్నే పోస్టుమార్టం చేయించి స్వగ్రామానికి పంపడాన్ని కూడా రాజకీయం చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. వైసీపీ నాయకులు శవరాజకీయాలు మానుకోవాలన్నారు.

### ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శిగా హరున్ రషీద్

ఉరవకొండ, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శిగా పట్టణానికి చెందిన హరున్ రషీద్ ఎన్నికయ్యారు. ఈనెల 3, 4 తేదీల్లో గుంతకల్లులో నిర్వహించిన ఎస్ఎఫ్ఐ 33వ మహాసభలో తనను ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు.

### 11న యోధుల కుటుంబీకులకు సన్మానం

గుంతకల్లు, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): పేద ప్రజల హక్కుల సాధనలో అసువులుబాసిన కమ్యూనిస్టు యోధుల కుటుంబీకులకు ఈ నెల 11న అనంతపురం లలితకళా పరిషత్‌లో సన్మానిస్తున్నట్లు సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జగదీశ్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. విద్యాలయాల్లో పార్టీల ప్రమేయం ఉండరాదంటూ జీవోలను తెచ్చిన రాష్ట్ర ప్రభుత్వం పేరెంట్స్ డే పేరుతో టీడీపీ నాయకులను పాఠశాలలకు పంపడం సమంజసం కాదన్నారు.

### గ్రీవెన్స్ ఫిర్యాదులపై విచారణ

బెళుగుప్ప, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నరసాపురంలో గ్రీవెన్స్‌కు వచ్చిన పలు ఫిర్యాదులపై ఆర్డీవో వసంత్‌బాబు శుక్రవారం విచారణ చేపట్టారు. పూర్తిస్థాయిలో విచారించి సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ అనిల్‌కుమార్ తెలిపారు.

### ఘనంగా ప్రపంచ మట్టి దినోత్సవం

వజ్రకరూరు (ఉరవకొండ), డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): వజ్రకరూరు మండలంలోని జే.రాంపురంలో సే ట్రీస్ ఆగ్రో ఫారెస్ట్రీ ఆధ్వర్యంలో ప్రపంచ మట్టి దినోత్సవ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. మట్టి రకాల గురించి, మట్టి పరీక్షలు చేయడం వచ్చే లాభాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌సీ బాలునాయక్, కమిటీ లీడర్ గిరిబాబు, రైతులు పాల్గొన్నారు.

### సీఐటీయూ మహాసభలను జయప్రదం చేయండి

గుంతకల్లుటౌన్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): విశాఖలో ఈనెల 31, జనవరి 1, 2, 3, 4వ తేదీల్లో నిర్వహించే 18వ సీఐటీయూ మహాసభలను జయప్రదం చేయాలని సీఐటీయూ నాయకులు పేర్కొన్నారు. స్థానిక రైల్వే స్టేషన్ వద్ద ఈ మహాసభల పోస్టర్లను ఆవిష్కరించిన వారు మాట్లాడారు. నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలన్నారు. రైల్వేతో సహ అన్ని రంగ సంస్థలను ప్రైవేటీకరణ ఆపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు బీ శ్రీనివాసులు, సాకే నాగరాజు, జయరాజ్, హుసేన్ పాల్గొన్నారు.

## రైల్వే డీజిల్ షెడ్ వార్షికోత్సవం




కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న డీఆర్ఎం

గుత్తి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): గుత్తి రైల్వే డీజిల్ షెడ్ 62వ వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. డీఆర్ఎం చంద్రశేఖర్ గుప్త మాట్లాడుతూ.. గుత్తి డీజిల్ లోకో ఎలక్ట్రికల్ షెడ్‌లో కార్మికుల సమష్టి కృషి వల్లే ఇండియన్ రైల్వేలోనే ఇది నెంబర్-1 స్థానంలో నిలిచిందన్నారు. కార్మికుల కృషిని అభినందిస్తూ రూ. 25 వేలు అవార్డును ప్రకటించారు. ఇందులో గుంతకల్లు ఉమేన్స్ వెల్ఫేర్ ఆర్గనేజేషన్ ప్రెసిడెంట్ మమత గుప్తా, ఏడీఆర్ఎం సుధాకర్ గుంతకల్లు చీఫ్ మెడికల్ అధికారి వేణుగోపాల్ రెడ్డి, స్థానిక డీజిల్ షెడ్ సీనియర్ డీఎంఈ రమేష్ పాల్గొన్నారు.

# పండుగలా మెగా పీటీఎం

ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థుల తల్లిదండ్రులు





గుంతకల్లు : సమావేశంలో మాట్లాడుతున్న కౌన్సిలర్ సుధాకర్, కూడేరు : కమ్మూరు పాఠశాలలో పాల్గొన్న విద్యార్థుల తల్లిదండ్రులు, అధికారులు

రాయదుర్గంరూరల్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జడ్పీ బాలికోన్నత పాఠశాలలో మెగా పేటీఎం 3.0 కార్యక్రమంలో విప్ కాలవ శ్రీనివాసులు పాల్గొన్నారు. అలాగే ఉద్దేహాళ్ పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలోనూ పాల్గొన్న విప్.. విద్యార్థులతో కలసి భోజనం చేశారు.

● గుత్తి : పట్టణంలోని మోడల్ పాఠశాల, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించిన మెగా పేరెంట్స్ ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ పాల్గొన్నారు. మోడల్ పాఠశాలలో సీఎంఎస్ నిధులు రూ. 11లక్షలతో ప్లే గ్రౌండ్ అభివృద్ధి, ఏపీఎస్ఎస్ నిధులు రూ. 15లక్షలతో మోడల్ హాస్టల్ మరమ్మతు పనులను ప్రారంభించారు.

● కళ్యాణదుర్గం : పట్టణంలోని ఏపీ మోడల్ స్కూల్‌లో నిర్వహించిన మీటింగ్‌లో ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు పాల్గొన్నారు. పదో తరగతిలో 580 మార్కులు పైన వచ్చిన విద్యార్థులకు మంత్రి నారాలోకేశ్ వద్దకు తీసుకెళ్లి, అక్కడి నుంచి విమానంలో విహార యాత్రకు తీసుకెళ్తారని ఎమ్మెల్యే తెలిపారు.

● కుందుర్పి : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన సమావేశంలోనూ ఎమ్మెల్యే అమిలినేని పాల్గొన్నారు. ఎస్ఆర్‌సీ సంస్థ సాయంతో ఈ కళాశాలలో కంప్యూటర్ ల్యాబ్ ఏర్పాటు చేశామని, కంప్యూటర్ శిక్షణ ఇచ్చేందుకు ఏర్పాటు చేసుకుంటే ప్రతి నెలా వేతనం తానే అందిస్తానని హామీ ఇచ్చారు.

● పెద్దవడుగూరు :స్థానిక కేజీబీవీ, జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించి మెగా పేరెంట్స్ కార్యక్రమంలో ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి పాల్గొన్నారు. విద్యార్థులకు క్రీడా పరికరాలు అందజేశారు.

● గుంతకల్లు : స్థానిక కేజీబీవీ పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో టీడీపీ నాయకులు గుమ్మనూరు నారాయణస్వామి, ఎస్‌జేపీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భవాని పాల్గొన్నారు.

● గుంతకల్లుటౌన్ : స్థానిక 32వ వార్డులోని ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన పేరెంట్స్, టీచర్స్ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఆ వార్డు కౌన్సిలర్ వై సుధాకర్ విచ్చేశారు. అనంతరం విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో కలసి భోజనం చేశారు.

● ఉరవకొండ :పట్టణంలోని జూనియర్ బాలిక కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఏపీ ఐడీసీ మాజీ డైరెక్టర్ దేవినేని పురుషోత్తం, మండల, పట్టణ కన్వీనర్ విజయ్‌భాస్కర్ పాల్గొన్నారు. గ్రంథాలయం, మ్యాథ్స్ ల్యాబ్‌ను ప్రారంభించారు. వజ్రకరూరు మండలం ప్యాపిలి, కొత్తకోట ప్రభుత్వ పాఠశాలకు గోనుగుంట్ల నాగేంద్ర ఐదు వాటర్ ఫిల్టర్‌ను అందజేశారు.

● విడపనకల్లు : స్థానిక జడ్పీ పాఠశాలలో వివిధ క్రీడా పోటీల్లో ప్రతిభచూపిన విద్యార్థులను సన్మానించారు. విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఇందులో పాల్గొన్నారు.

అలాగే రాయదుర్గం, తాడిపత్రి, కూడేరు, శెట్టూరు, యాడికి, బెళుగుప్ప, కణేకల్లు, యల్లనూరు, బ్రహ్మసముద్రం మండలాల్లోనూ ఈ కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించారు.

## పేద కుటుంబానికి చేయూత

● ఎమ్మెల్యే వద్ద కష్టాలతో విలపించిన విద్యార్థిని
● వెంటనే ఇంటి పట్టా మంజూరు చేయించిన అమిలినేని



విలపిస్తున్న ఐశ్వర్యను ఓదార్చుతున్న ఎమ్మెల్యే అమిలినేని

కుందుర్పి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): స్థానిక కళాశాలలో నిర్వహించిన పేరెంట్స్ టీచర్స్ సమావేశంలో ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు పాల్గొన్నారు. సమావేశం అనంతరం మండల కేంద్రానికి చెందిన 8వ తరగతి విద్యార్థి ఐశ్వర్య తన కుటుంబ సమస్యలను ఎమ్మెల్యేకు వివరిస్తూ.. బోరున విలపించింది. 'సార్ మాది చాలా పేద కుటుంబం. మేం నలుగురు ఆడపిల్లలున్నాం. మా అమ్మనాన్న చాలా ఇబ్బందులు పడుతూ మమ్మల్ని చదివిస్తున్నారు. మా అక్కకు రెండు కిడ్నీలు దెబ్బతినడంతో ప్రతి నెలా డయాలసిస్‌కు రూ. 15 వేలు ఖర్చు అవుతోంది. మాకు సొంత ఇల్లు కూడా లేదు సార్..' అంటూ విలపించింది. చలించిపోయిన ఎమ్మెల్యే వెంటనే పట్టాను మంజూరు చేయాలని తహసీల్దార్ ఓబులేష్‌ను ఆదేశించారు. వారి సమస్యలపై ఆరా తీసి.. ఆదుకోవాలని టీడీపీ నాయకులను ఆదేశించారు. దీంతో రెవెన్యూ అధికారులు, టీడీపీ నాయకులు హుటాహుటిన ఆ విద్యార్థి తల్లిదండ్రుల వద్దకు చేరుకుని వారి సమస్యలపై ఆరా తీశారు. అనంతరం తహసీల్దార్ వారికి ఇంటి పట్టాను అందజేశారు.

● సమస్యలపై ఆరా: మండల కేంద్రంలో ఎమ్మెల్యే పర్యటిస్తూ.. సమస్యలపై ఎమ్మెల్యే ఆరా తీశారు. మురుగు కాలువలు ఏర్పాటు చేయాలని స్థానికులు ఎమ్మెల్యేను కోరారు.

● ఫైర్‌స్టేషన్ నిర్మాణానికి భూమిపూజ

కళ్యాణదుర్గం: స్థానిక కృషి విజ్ఞాన కేంద్ర సమీపంలో 60 సెంట్లలో అగ్నిమాపక కేంద్ర భవన నిర్మాణానికి ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు శుక్రవారం భూమిపూజ చేశారు. రూ.2.25 కోట్లతో ఈ భవనాన్ని 18 నెలల్లో పూర్తి చేయిస్తామన్నారు. కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## డిప్యూటీ ఎంపీడీవోకు సన్మానం



డిప్యూటీ ఎంపీడీవోను సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

ఉరవకొండ, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): విడపనకల్లు డిప్యూటీ ఎంపీడీవోగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన గుర్రం నందకుమార్‌ను టీడీపీ నాయకులు, కురుబసంఘం నాయకులు వేర్వేరుగా శుక్రవారం సన్మానించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ విజయ్‌భాస్కర్, నాయకులు ఎన్ చలపతి, గుర్రం నరేష్, కురుబసంఘం నాయకులు బ్యాళ్ల ఈశ్వరయ్య, చాబాల ఈశ్వరయ్య, తిమ్మప్ప, గోపాల్ పాల్గొన్నారు.

## రైల్వేస్టేషన్‌లో కనీస సౌకర్యాలు కల్పించండి

యాడికి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాయలచెరువు రైల్వేస్టేషన్‌లో కనీస సౌకర్యాలు కల్పించాలని రైల్వేస్టేషన్ మేనేజర్‌కు లయన్స్ క్లబ్ సభ్యులు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. జాతీయ రహదారి నుంచి రైల్వేస్టేషన్ వచ్చే రోడ్డు గుంతలమయమైందని, 80 అడుగుల రోడ్డు ఆక్రమణలతో కుచించుకుపోయిందని తెలిపారు. వర్షాకాలంలో రోడ్డుపై నీరు నిలుస్తుండటంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. రైల్వేస్టేషన్ వద్ద పార్కింగ్ లేక వాహనదారులు ఇబ్బందులు పలుపాట్లు పడుతున్నారు. రైల్వేస్టేషన్‌ను ఆధునీకరించి ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు అందించేలా చర్యలు చేపట్టాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో సభ్యులు కులశేఖర్‌నాయుడు, రవికుమార్‌రెడ్డి, సత్యరంగయ్య, రవిప్రసాద్, సూర్యనారాయణ, రామకృష్ణ, గోపాల్‌నాయుడు, ప్రసాద్ ఉన్నారు.

### నేడు ప్రజాదర్బార్

పెద్దపప్పూరు, డిసెంబరు5(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి తాడిపత్రిలోని ఆయన నివాసంలో శనివారం ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మండల కన్వీనర్ తాతిరెడ్డి లోకనాథ్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. మండలంలోని ప్రజలు, రైతులు వారి సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొని వెళ్లి.. పరిష్కరించుకోవాలని సూచించారు.

## జాతీయస్థాయి పోటీలకు ఎంపిక

విడపనకల్లు, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): కర్నూల్‌లో నవంబరు 21 నుంచి 23 వరకూ జరిగిన స్కూల్ గేమ్స్ ఆఫ్ ఫెడరేషన్ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థి జీ వినయ్ ప్రతిభ చాటాడు. దీంతో అతను జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం సురేష్‌బాబు తెలిపారు.



వినయ్‌ను అభినందిస్తున్న సిబ్బంది

## ప్రతి రైతు ధాన్యాన్ని కొంటాం: విప్



వరికోత పనులు ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ కాలవ

బొమ్మనహాళ్, డిసెంబరు5(ఆంధ్రజ్యోతి): వరి కోతలు ప్రారంభం కాగానే.. ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని, రైతులు దళారులను నమ్మి మోసపోకుండా కేంద్రాల్లోనే విక్రయించాలని, ప్రతి రైతు ధాన్యం కొనుగోలు చేస్తామని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు అన్నారు. మండలంలోని శ్రీనివాస్‌క్యాంప్ వద్ద వరి కోతలను శుక్రవారం ప్రారంభించిన ఆయన మాట్లాడారు. ఆయకట్టుకు సకాలంలో సాగు నీరు ఇవ్వడం.. పంటలు ముందుగా వేసుకోవడంతో.. దిగుబడులు బాగా వచ్చాయన్నారు. కార్యక్రమంలో ఏవో సాయికుమార్, టీడీపీ మండల కన్వీనర్ బలరాంరెడ్డి, సింగ్‌విండో చైర్మన్ కొత్తపల్లి మల్లికార్జున, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

## పీహెచ్‌సీ భవనం ప్రారంభం



పీహెచ్‌సీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అశ్మిత్‌రెడ్డి

పెద్దవడుగూరు, డిసెంబరు5(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో రూ.1.86 కోట్లతో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్యకేంద్ర భవనాన్ని ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు మరింత మెరుగైన వైద్యసేవలు అందించాలని సిబ్బందికి సూచించారు. తనవంతు సాయంగా అంబులెన్స్‌ను ఉచితంగా అందిస్తానని హామీ ఇచ్చారు.

## కోట ముఖద్వార పునర్నిర్మాణానికి శ్రీకారం



కోట వద్ద చేపట్టిన పనులు

రాయదుర్గంరూరల్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కోట ముఖద్వార పునర్నిర్మాణ పనులను పురావస్తుశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రారంభించారు. రాయదుర్గం హెరిటేజ్ అసోషియేషన్ విజ్ఞప్తి మేరకు ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు చొరవతో నిధులు విడుదలయ్యాయి. 2025-26 ఆర్థిక సంవత్సరానికి విడుదలైన రూ. 10 లక్షలతో ఈ పనులను ప్రారంభించారు.

### లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి

గుత్తి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): జాతీయ లోక్‌అదాలత్‌ను ఈనెల 13న నిర్వహిస్తున్నామని, పెద్ద మొత్తంలో కేసులో పరిష్కరించేలా చూడాలని అదనపు జిల్లా ఆరో న్యాయాధికారి సాధుబాబు, సీనియర్ సివిల్ న్యాయాధికారి ఎం కాశీవిశ్వానాథాచారి, జూడీషియల్ ఫస్ట్‌క్లాస్ న్యాయాధికారి శ్వేత పేర్కొన్నారు. స్థానిక అదనపు జిల్లా ఆరో న్యాయాధికారి కోర్టు హాల్‌లో పోలీస్ అధికారులతో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ఇందులో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వీడీ రత్నం, ఏజీపీ ఫక్రుబాషా, ఎస్ఐ సురేష్, ఎక్సైజ్ సీఐ ఉమాదేవి, న్యాయవాదులు పాల్గొన్నారు.

### రైతు కుటుంబాన్ని ఆదుకోవాలి

తాడిపత్రి, డిసెంబరు5(ఆంధ్రజ్యోతి): పుట్లూరు మండలం ఎల్లుట్ల గ్రామానికి చెందిన అరటిరైతు నాగలింగం అప్పులబాధ తాళలేక ఆత్మహత్య చేసుకున్నాడని, అతని కుటుంబాన్ని ప్రభుత్వమే ఆదుకోవాలని రైతు సంఘం నాయకుడు రాజారామిరెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక రైతు సంఘం కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ .. ప్రస్తుతం అరటి రైతులను ఆదుకునేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో నాగరాజు, శిరీష, జయశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

### ఇన్‌ఫ్లో 2,580 క్యూసెక్కులు

బెళుగుప్ప, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌కు ఇన్‌ఫ్లో 2,580, ఔట్‌ఫ్లో 2,580 క్యూసెక్కులు ఉన్నట్లు హంద్రీనీవా అధికారులు శుక్రవారం తెలిపారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో 1.724 టీఎంసీల నీరు ఉందని, ఇక్కడి నుంచి ఫేజ్-2కు 1,810 క్యూసెక్కులు నీరు వెళ్తోందని తెలిపారు.

క్రైం న్యూస్..

## రైతు ఆత్మహత్యాయత్నం

పొలంలో పవర్‌గ్రిడ్ టవర్ ఏర్పాటే కారణం

తాడిపత్రి, డిసెంబరు5(ఆంధ్రజ్యోతి): పవర్‌గ్రిడ్ అధికారులు తనతో చర్చించకుండా.. తన పొలంలో టవర్ ఏర్పాటు చేస్తున్నారని మండలంలోని యర్రగుంటపల్లికి చెందిన రైతు గంగాధర్ శుక్రవారం విషద్రావకం తాగి... ఆత్మహత్యకు యత్నించాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పవర్‌గ్రిడ్ అధికారులు తన పొలంలో శుక్రవారం టవర్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలుసుకున్న గంగాధర్ వెంటనే అక్కడికి వెళ్లాడు. ఇది ప్రభుత్వ స్థలం కాదని, తన స్థలమని, కనీసం రైతులను సంప్రదించకుండా ఎలా టవర్లు ఏర్పాటు చేస్తారని అక్కడి అధికారులను ప్రశ్నించాడు. అయినా ఆ అధికారులు ఏ మాత్రం స్పందించకుండా తమ పనులు చేస్తుండటంతో.. గంగాధర్ అక్కడే విషద్రావకం తాగాడు. గుర్తించిన తోటి రైతులు అతన్ని వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు. బాధితుని కుటుంబ సభ్యులు గంగాధర్‌కు ఏమైనా జరిగితే పవర్‌గ్రిడ్ అధికారులదే బాధ్యత అని హెచ్చరించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.



గంగాధర్‌ను ఆస్పత్రికి తరలిస్తున్న సిబ్బంది

● 15న ధర్నా : జేసీపీఆర్

రైతు గంగాధర్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడటం దురదృష్టకరమని మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి సోషల్ మీడియాలో తెలిపారు. కొన్ని గ్రామాల్లో భూముల ధరలు ఎక్కువగా ఉన్నా... రైతులను భయభ్రాంతులకు గురిచేసి తక్కువ ధరకు తీసుకోవడం బాధాకరమన్నారు. గతంలో తానే స్వయంగా దీనిపై ధర్నాలు చేశానన్నారు. ఈనెల 15న పవర్‌గ్రిడ్ పనులు జరిగే గ్రామాల్లోని ప్రజలు తరలివస్తే పెద్దఎత్తున ధర్నా చేస్తామన్నారు. రైతుల మేలు కోరే నాయకులు, ప్రజలు ఈ ధర్నాకు తరలిరావాలని కోరారు.

### చోరీ కేసులో ముగ్గురి అరెస్టు

విడపనకల్లు, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): స్థానిక సుబ్బలక్ష్మి కాలనీకి చెందిన రైతు మల్లికార్జున ఇంట్లో గతనెల 27న చోరీ జరిగిన విషయం తెల్సిందే. కేసు దర్యాప్తు చేపట్టిన ఎస్ఐ ఖాజాహుస్సేన్ చీరలగురికి గ్రామానికి చెందిన కొత్తపల్లి చంద్ర, కొత్తపల్లి సురేంద్ర, కొత్తపల్లి చంద్రమోహన్‌ను శుక్రవారం అరెస్టు చేశారు. వారి నుంచి చోరీ జరిగిన రూ.లక్షను స్వాధీనం చేసుకున్నారు. వారిని ఉరవకొండ కోర్టులో హాజరుపరచి.. రిమాండ్‌కు తరలించారు.

### పోలీసుల అదుపులో అనుమానితులు

తాడిపత్రి, డిసెంబరు5(ఆంధ్రజ్యోతి): మండలం అయ్యవారిపల్లి గ్రామంలో ఇద్దరు మహిళలు అనుమానాస్పదంగా సంచరిస్తుండగా.. స్థానిక మహిళలు గుర్తించారు. పిల్లలను ఎత్తుకెళ్లేందుకు వచ్చారనే అనుమానంతో వారిని పట్టుకొని ఆరాతీశారు. సరైన సమాధానాలు ఇవ్వకపోవడంతో వారితో వాగ్వాదానికి దిగారు. వారిని తెలంగాణా రాష్ట్రం స్టేషన్‌ఘన్‌పూర్‌కు చెందిన మహిళలుగా గుర్తించారు. వారిని పోలీసులకు అప్పగించారు.

### జూదరుల అరెస్ట్

యాడికి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): స్థానిక గుడిసెలు గ్రామం వద్ద పేకాట ఆడుతున్న యాడికికి చెందిన నలుగురు వ్యక్తులను శుక్రవారం అరెస్ట్‌చేసినట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు. వారివద్ద నుంచి రూ.14,800 స్వాధీనం చేసుకున్నామని, కేసు నమోదు చేశామని చెప్పారు.

## 11న దుర్గం మున్సిపల్ చైర్మన్ ఎన్నికలు

కళ్యాణదుర్గం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ చైర్మన్ ఎన్నికలను ఈనెల 11న నిర్వహించాలని ఎన్నికల కమిషన్ ఉత్తర్వులు జారీ చేసింది. మున్సిపాలిటీలో మొత్తం 24 మంది కౌన్సిలర్లు ఉండగా.. 13 మంది వైసీపీ వర్గీయులు, 11 మంది టీడీపీ వర్గీయులు ఉన్నారు. అయితే ఎక్స్ ఆఫీసియో హోదాలో ఎమ్మెల్యే, ఎంపీలకు ఈ ఎన్నికల్లో పాల్గొని ఓటు వేసే హక్కు ఉంది. దీంతో టీడీపీ బలం 13కి చేరుతుంది. ఇరుపార్టీలకు సమానమైన బలాబలాలు ఉన్నాయి. చైర్మన్ పీఠాన్ని టీడీపీ కైవసం చేసువడానికి ఇరు పార్టీల నాయకులు జోరుగా వ్యూహాలు, ప్రతి వ్యూహాలు రచిస్తున్నారు. వైసీపీ తన కౌన్సిలర్లు 13 మందిని ఈ నెల 11 వరకు విహారయాత్ర పేరుతో కర్ణాటక ప్రాంతంలో రిసార్ట్‌కు తీసుకెళ్లే యోచనలో ఉంది.

## నాడు వేటు.. నేడు చోటు..!

● వైసీపీ బరితెగింపు రాజకీయాలు
● నాడు అవసరంలేదని పార్టీ నుంచి సస్పెన్షన్
● నేడు చైర్మన్ ఎన్నిక నేపథ్యంలో ఎత్తివేత

కళ్యాణదుర్గం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో వైసీపీ నీచ, బరితెగింపు రాజకీయాలు తారాస్థాయికి చేరాయి. అందితే జుట్టు.. లేకపోతే కాళ్లు.. అనే సామెతను గుర్తు తెస్తున్నాయి. ఈ యేడాది జూలైలో ఓ కార్యక్రమంలో ఎమ్మెల్యే అమిలినేనికి వైసీపీ నేత, మున్సిపల్ వైస్ చైర్మన్ జయం ఫణీంద్ర పుష్పగుచ్ఛం ఇచ్చారు. దీంతో వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తలారి రంగయ్య జయం ఫణీంద్రను ఏకంగా పార్టీ నుంచి నాడు వెంటనే సస్పెండ్ చేయించాడు. ప్రస్తుతం మున్సిపల్ చైర్మన్ ఎన్నికకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ జారీ చేసింది. దీంతో ఇప్పుడు జయం ఫణీంద్ర మద్దతు పార్టీకి తప్పనిసరి అయింది. దీంతో తలారి రంగయ్య గత్యంతరం లేక జయం ఫణీంద్రను తిరిగి పార్టీలోకి ఆహ్వానిస్తున్నారు. అంతేకాకుండా హడావుడిగా తాడేపల్లి వైసీపీ కేంద్ర కార్యాలయం నుంచి జయం ఫణీంద్రపై సస్పెన్షన్‌ను ఎత్తివేస్తున్నట్లు ప్రకటనను కూడా విడుదల చేయించారు.



జయం ఫణీంద్ర

## వైభవంగా వీరభద్రస్వామి రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

గుమ్మఘట్ట, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని తాళ్లకెరలో శుక్రవారం వీరభద్రస్వామి రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. శుక్రవారం వేకువజామున స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, ఆకుపూజ నిర్వహించారు. రథోత్సవాన్ని పురవీధుల్లో.. నందికోలాటాల మధ్య చేపట్టారు. రథోత్సవానికి కర్ణాటక పరిసర ప్రాంతాల నుంచి వందలాది మంది భక్తులు హాజరయ్యారు. టీడీపీ కన్వీనర్ కాలవ సన్నన్న, మాజీ కన్వీనర్ గిరిమల్లప్ప, మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు శ్రీరాములు స్వామి వారికి ప్రత్యేక పూజలు జరిపించారు.